
ప్రేమలో
మనం
బి. గీతిక

ప్రేమలో మనం

బి. గీతిక

PREMALOMANAM

written by **B. Geetika**

e-mail : b.geetika@ymail.com
Blog : http : //premalo-manam.blogspot.in

First Edition : 2013

No. of Copies : 1000

Price : 80/-

Cover Design : Ch. Pavan Kumar (M.F.A.)

For Copies :

1. Phone : 99080 63266
2. Visalaandhra Publishing House,
Giriprasad Bhavan,
Bandlaguda, Nogole,
G.S.I (Post), Hyderabad - 68.
3. Visalaandhra All Branches.

Printed at :

Sai Teja Printers
Main Road, NARSAPUR-534 275.
Cell : 9247347626, 93466 33812

కృతజ్ఞతలు

మన బంధాల్లోని ఈ ప్రేమ భావాల్ని ఫన్‌డేలో 'ప్రేమ కాలమ్'గా ప్రచురించిన సాక్షి దినపత్రిక సంపాదకులకి..;

మిగిలిన కవితల్ని ప్రచురించిన చతుర మాసపత్రిక, ఆంధ్రభూమి దిన, వార, మాస పత్రికలవారికి..;

ఎప్పటికప్పుడు ప్రేమ శీర్షికపై పాఠకుల ప్రతిస్పందనల్ని చెప్తూ, నన్ను ప్రోత్సహించిన పూడూరి రాజిరెడ్డి గారికి..;

'ప్రేమలో మనం' పుస్తకానికి అడగగానే అందంగా ముఖచిత్రాన్ని వేసి ఇచ్చిన పవన్ కుమార్‌కి..;

ప్రేమ శీర్షికని ప్రతీవారం చదివి, "ఉత్తరాలు వ్రాయడం మర్చిపోయిన మాతో ఉత్తరం వ్రాయించారు.." అంటూ ఈ రోజుల్లోనూ తమ అభిమానాన్ని ఉత్తరాల ద్వారా తెలియజేసిన ప్రతీ పాఠకులకీ..;

ఈ మెయిల్స్ ద్వారా, ఎస్.ఎమ్.ఎస్‌ల ద్వారా అభిప్రాయాల్ని తెలిపిన చదువరులకీ..

అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు..

గీతిక

నా మాట

ప్రేమలో మనం..

అని ఎందుకు అన్నానంటే ప్రతి మనిషి కూడా ఎప్పుడూ ఎవరో ఒకరి ప్రేమలో ఉండక తప్పదు.

చిన్నప్పుడు తల్లిదండ్రుల ప్రేమ..

కౌమారంలో స్నేహితుల ప్రేమ..

యవ్వనంలో చెలి/చెలికాని ప్రేమ..

మధ్యవయసులో భార్య/భర్త ప్రేమ..

ముసలి వయసులో కుటుంబసభ్యుల ప్రేమ..

ఇలా ఎవరో ఒకరి ప్రేమలో ఉండక తప్పదు.

ఎవరో ఒకరి ప్రేమలో మనం ఎప్పుడూ ఉంటున్నామంటే ప్రేమలో మనం ఉన్నట్లే. అందుకే 'ప్రేమలో మనం' అన్నాను.

గాలీ, నీరు, ఆహారంలా.. నిత్యావసరమైన ఈ ప్రేమ నాగరిక ప్రపంచంలో వాటన్నిటిలానే కలుషితమైపోతోంది. అలాంటి కలుషితమైన ప్రేమని చూస్తుంటే.. అంతరంగంలో ఏదో జ్వలన.

అదంతా ప్రేమకాదు అని బలంగా అనిపిస్తుంటే; ప్రేమంటే ఏంటో నాకు తెలిసినది చెప్పాలనే తపన.

అందుకు పునాదిగా అందర్నీ, అందరిలోని ప్రేమనీ పరిశీలించడం మొదలుపెట్టాను. కానీ ఆ పరిశీలనలో కనిపించిన ఎన్నో భావోద్వేగాల్నీ అక్షరీకరించడంలో మొదటి అడుగు ఏ వైపునుంచి వేయాలన్న సంశయం..!

ఎందుకంటే ఏ ఒక్కరివైపు నుంచో, ఒక కోణంలోంచో వ్రాసినది ఏదైనా అది ఎప్పటికీ సమగ్రం కాదు.

ప్రేమకి ఆడ, మగ.. అనే భేదం లేదు. అందుకే రెండువైపుల నుంచీ ప్రతి భావననీ గమనిస్తూ, లోతులకు వెళ్ళిన కొద్దీ ప్రేమకి కొత్త అర్థాన్ని నేర్పింది.. నా చుట్టూ ఉన్న అద్భుతమైన ప్రకృతి.

వ్యక్తి ప్రేమకోసం మొదలుపెట్టిన నా అన్వేషణలో ఆఖరి మజిలీగా.. ఒక వాస్తవం బోధపడింది..! అదే విశ్వవ్యాప్తమైన ప్రేమ..!!

నా లోలోపల్లో.. ఎన్నో ప్రశ్నల్తో, ఆలోచనల్తో రగిలిరగిలీ సమాధానపడిన అంశాలూ, అంతర్మధనాలూ అన్నీ చివరికి ఈ ప్రేమ భాగాలుగా అక్షరాలై కాగితం మీద కొచ్చాయి. ఆ అక్షరాలే సాక్షి ఫన్‌డేలో ది.28-9-2008 నుండి ది.23-8-2009 వరకూ ప్రేమ శీర్షికగా వారంవారం ప్రచురితమయ్యాయి.

ఆ శీర్షికనే ఇప్పుడు "ప్రేమలో మనం"గా **నా మొదటి పుస్తకరూపంలో** మీ ముందుకు తెస్తున్నాను. వారంవారం వ్రాసిన ఈ భావాలన్నీ ప్రేమ అనే అంశం చుట్టూ పరిభ్రమించేవి కాబట్టి ఒక్కొక్క భాగాన్నీ లోతుగా చూడమని మనవి. వాటితో పాటూ ఆహ్లాదకరంగా ఉన్నప్పుడో, అభావంగా ఉన్నప్పుడో, వ్యక్తీకరించుకున్న కవితల్ని కొన్నింటిని ఈ పుస్తకంలో చేర్చాను.

బంధాల్లో తెలిసీ తెలియకుండా మన ప్రవర్తనతో మనం పోగొట్టుకునే ప్రేమని చాలావరకూ ఈ 'ప్రేమలో మనం'లో స్పృశించగలిగానని భావిస్తున్నాను.

రసాస్వాదన కలిగిన పాఠకులందరూ నా ఈ ప్రేమలోతుని అవగాహన చేసుకుంటారని ఆశిస్తూ..

బి. గీతిక

విషయ సూచిక

1. నిజంగా అతన్ని ప్రేమిస్తున్నామా...

అతన్నెంతగానో ఇష్టపడతామా... చివరికి కళ్ళల్లో పెట్టి చూసుకున్న అమ్మానాన్నల్ని కూడా లెక్కచెయ్యం. కేవలం అతనికోసం.. అనురాగం కురిపించే అతని సాన్నిహిత్యం కోసం ప్రపంచంతో సహా అన్నీ వదిలేస్తాం.

చల్లని చూపుతో హత్తుకుని, జీవితాంతం తోడుంటానని ప్రేమతో ఇచ్చే భరోసాకోసం ఎన్నాళ్ళైనా ఎదురు చూడాలనుకుంటాం. అతని సాహచర్యంలో ఒక్కరోజు బతికి మరణించినా చాలనుకుంటాం. అతని అడుగులో అడుగేస్తూ అతని నవ్వులో నవ్వు కలపాలనుకుంటాం.

కానీ అదేమిటో.. అతను వచ్చీ రాగానే అయిన అరగంట ఆలస్యం గురించో, నిన్నటిరోజు ప్రాముఖ్యం మర్చిపోయాడనో, మొన్న ఫోను చేయలేదనో ఋంగమూతి పెట్టి సాధిస్తాం.

కలసి ఉన్న ఈ కొద్ది నిమిషాల్లో కలబోసుకోవలసిన అనుభూతుల్నీ, పంచుకోవాల్సిన భావాల్నీ వదిలేసి అనవసర వాదనలు చేస్తాం. నిద్ర పట్టక ఆకాశానికి కళ్ళూన్చి అతని గురించి గుసగుసలు పోయిన సంగతిని మర్చిపోతాం.

"మొన్న- వానొచ్చి వెలిసిపోయాక చమక్కుమన్న హరివిల్లుని చూడగానే నువ్వు గుర్తొచ్చావ్.." అని చెప్పి సుతారంగా అతని చెంప తట్టాలనుకున్న మన చిన్ని కోరికనీ మర్చిపోతాం.

ప్రేమనే కాదు, అన్ని భావాల్నీ మర్చిపోతాం. ఎదురుగా ఉన్న అతనికంటే గడిచిపోయిన పొరపాట్లే ముఖ్యం మనకి.

మరి.. మనం నిజంగా అతన్ని ప్రేమిస్తున్నామా...?

౨. ప్రేమంటే...

ప్రతి మనిషికీ జీవితంలో ప్రేమ కావాలి. గుండెకు ఊపిరిలా మనసుకు ప్రేమ. సప్తవర్ణాల్ని తనలో దాచుకుని పైకి మాత్రం శూన్యంలా, వర్ణరహితంగా కనిపించేదే ప్రేమ.

ప్రేమలో నిబంధనలుండవు. ఎల్లలు లేనిది ప్రేమ. ఆ ప్రేమ ఒక్కలాగే ఉండదు. ఒక్కరికే పరిమితం కాదు.

'తీపి' అనే పదం ప్రేమయితే ఆ తీపిలోని రకాలలాగే ప్రేమ భావాలు కూడా. బెల్లంలోని తియ్యదనం, తేనెలోని మధురత్వం.. వీటిలా ప్రేమ కూడా రకరకాల మధుర భావాలతో మనసుని నింపుతుంది.

ప్రేమంటే.. ఉదయించే వెచ్చదనంలోని వెలుగే కాదు.. అస్తమించాక వచ్చే చల్లని చీకటి కూడా.

ఎన్నెన్నో చినుకులు.. నీలాకాశపు గుండెల్లోంచి గమ్యం తెలీని వాటి పయనం..! అవన్నీ భావాలైతే వాటిలో ఏ మూలో దాగి ఉన్న స్వాతి చినుకు ప్రేమ భావం.

ప్రేమంటే ఒక ఆర్ద్రత. గుండెని సున్నితంగా తాకే భావావేశం..! ప్రేమంటే ఒక స్వచ్ఛత. కనుపాపల లోతుల్లోంచి హృదయాన్ని చూడగల స్పష్టత..! ప్రేమంటే స్వేచ్ఛ. తనకి దగ్గరగా ఉంటూనే అంతులేని అంచుల్లోకి వెళ్ళిరాగలంత స్వాతంత్ర్యం..! ప్రేమంటే అవగాహన. ప్రతిక్షణాన్నీ ఎదుటి వైపు నుంచీ చూడగల విశ్వసనీయత..!

మనకే తెలీని మన ఆలోచనల అయోమయంలో, వెంటాడే ఏకాకితనంలో.. మంచు కరిగి సుస్పష్టమైన ప్రకృతిలా ఓ చిరు దరహాసం మన భావోద్వేగాల్ని చీల్చుకుని మనసులో మెదిలితే ఆ గుర్తు ప్రేమదే.

3. ప్రేమించాలా...

మానవుడు మానవుడిగా బతకాలంటే ప్రేమించాలి. మానవత్వం పరిమళించాలంటే ప్రేమించాలి. ప్రేమ లేకుండా కూడా బతకవచ్చు.. దానవుల్లా, విచక్షణ లేని జంతువుల్లా..!

మనం ప్రేమించాల్సింది మనకోసం కాదు.. ప్రేమకోసం మనం ప్రేమించాలి. ప్రతీ క్షణాన్నీ ప్రేమించాలి. ప్రతి అనుభవాన్నీ ప్రేమించాలి.

సుఖాన్నే కాదు కష్టాన్నీ ప్రేమిస్తే.. అదే జీవించడం..! ప్రేమతో జీవించడం..!

వేకువ కళ్ళు తెరచీ తెరవగానే ఆమెకై వెదికే కన్నుల్లో ఒలికే ప్రేమని.. ఒడిసి పట్టినట్టుండే ఆమె చూపే ప్రేమ. తారు రోడ్డుమీద తోడులేక సాగే జిగిబిగి నడకల మధ్య మనల్ని చూసి, తన కంటి చూపెనకాల కొంటె నవ్వుల్ని దాచి భుజం గిల్లేదే ప్రేమ. నాలుగు నోట్లకోసం రోజల్లా పడే పాట్లకి చెమ్మగిల్లి గుండెని తడి చేసేదే ప్రేమ.

ఆ ప్రేమ నాదనుకుంటే అది ప్రేమ కాదు. నా మీదే.. అనుకున్నా అదీ ప్రేమ కాదు.

నన్నూ; నాలాగే ఆ పువ్వుని, ఆ సీతాకోక చిలుకని, ఆ కొంగని, ఈ సాయంత్రాన్నీ.. ప్రేమించాలి.

అసలు.. జీవితంలో మనం దేనినైనా ప్రేమించాలా..? ఎందుకు ప్రేమించాలి..? అని మనల్ని ప్రశ్నించుకుంటే ఖచ్చితమైన జవాబు ప్రేమించాలనే.

ఎందుకంటే ప్రేమంటే జీవం. జీవితాన్ని జీవింపజేసే ప్రాణం. అందుకే ప్రేమించాలి. ప్రేమ నిండిన జీవితాన్ని ప్రేమించాలి.

4. ఎలా ప్రేమించాలి...

ఓ సునిశిత దృష్టి.. ప్రతి కదలికనీ, ప్రతి మార్పునీ ఆస్వాదిస్తూ ఆలోకన చేసుకోగలిగే సునిశిత దృష్టిలోంచి ప్రేమ పుడుతుంది. ఆ నవ్యత్వంలో ప్రేమ ఉంటుంది.

తలెత్తి... మబ్బులు కమ్మిన నల్లటి ఆకాశాన్ని చూడగలిగే రసాస్వాదన మనకుంటే అసంకల్పితంగానే మనని తాకే తొలి చినుకుని చూస్తాం. ఆ చూపులోని భావమే ప్రేమ.

వచ్చీ రాగానే తాను చేయని తప్పుకి తిట్టించుకున్న సహోద్యోగినీ, తన బాధనీ చూడగలిగే సున్నితత్వం మనలో ఉంటే, వెనువెంటనే వెళ్ళి వెన్నుతట్టి ఓదార్చాలని.. హృదయం పడే తపనే ప్రేమ.

ప్రేమించడానికి అర్హత ఎదుటివాళ్ళలో ఉండదు. వారి అందమో, దర్పమో, పరపతో కాదు.

మన చూపుల్లో, ఆలోచనల్లో, చేతల్లో, మన మాటల్లో.. మన చుట్టూ అల్లుకున్న బంధాల్లోని మన ప్రతిస్పందన.. మనకున్న ప్రేమించే అర్హతెంతో చెబుతుంది.

నా ప్రేమని పొందే అర్హత తనకుందా.. అనుకుంటాం మనం. కానీ మనకి ప్రేమించేందుకు ఉండాల్సిన అర్హత ఉందా.. అని ప్రశ్నించుకోం. అందుకే మనం ప్రేమిస్తాం. మర్చిపోతాం.

ఈ యాంత్రిక ప్రపంచంలో క్షణక్షణమూ నా గురించే యోచించుకునే నాలో.. నాకు తెలీకుండానే నిండిపోయే తన గురించిన యోచనలే ప్రేమ.

అప్పుడిక ఎలా ప్రేమించాలన్న ప్రశ్నకి తావుండదు. ప్రేమించడమే ఉంటుంది.

5. నీ తలపే ప్రేమా...

నువ్వొచ్చావ్.. కేవలం నా కోసం వచ్చావ్.

అందరూ నిన్ను పలవరిస్తూ పొగుడుతుంటే అదేమిటో.. నేను సిగ్గుపడుతున్నాను.

మొన్న క్యాంపస్‌లో వెళ్తూ ఉన్నానా.. గట్టిగా కేక పెట్టారెవరో నీ పేరుని. అనాలోచితంగా వెనక్కు తిరిగేశాను. అందరి చూపులూ నామీదే. ఏంటింత పరధ్యానం.. నీ ధ్యానమేలే.

టీవీ ముందుండి రేపు నిన్ను కలవడం గురించి కలలుకంటూ అమ్మ పిలుపుకి ఉలిక్కిపడతాను. అమ్మ ఏదో చెప్తుంది. 'ఊ' కొడతాను. తర్వాత 'ఆ పని చేస్తానని చెయ్యలేదే..' అని నిలదీస్తుంది.

నీ పేరు రాసి, పుస్తకంలో ఉంచుకున్న గులాబిరేకుని నిమిష నిమిషానికి తడుముకోవడం చూసి చదువు ధ్యాసనుకుంటోంది అమ్మ.

ప్రతి నిమిషం నువ్వే. నాలోనూ నువ్వే..! నాకంటూ ఏమీలేని నాలో నేనెక్కడ..?

తెల్లారింది... మొదలిక నీ తలపులు. క్షణక్షణమూ నీ తలపుల చుట్టూ నేను..!

కానీ ఇదేమిటి..? ఇప్పుడు నిన్ను కలిశాక నా తలపుల్లోని నువ్వేమైపోయావ్..? నీ సమక్షంలో నా ఊహలన్నీ అచేతనమైపోయాయేం..? ఏదీ ఆ తలపుల మైమరపు..? ఏదీ అందులోని హాయి..?

నేస్తం..! ప్రేమంటే నువ్వా..? నీ తలపులా..?

6. ప్రేమ మొలక

కారుమబ్బులు ఆకాశం మొత్తాన్నీ కమ్మేసినప్పుడు విశ్వమంతా ఆవరించేసినట్టనిపించే ఆ **చీకటి**, ఆప్తులందర్నీ పోగొట్టుకుని అనాధగా మిగిలినప్పుడు బతకడం కూడా భారమనిపించే ఆ **నిస్పృహ**, తన ప్రాణాన్ని పణంగా పెట్టి చావుబతుకులతో పోరాడే ఓ తల్లి **ప్రసవ వేదన,..** ఎంత భారంగా ఉంటాయి..!

ఆ క్షణాలు కొన్నే అయినా ఎంత దీర్ఘంగా అనిపిస్తాయి..! భారమైన ఆ క్షణాలన్నీ గడిచిపోయాక..?

మనం చెప్పుకున్న కబుర్లు, ఆడుకున్న ఆటలు ఆనందాన్నే కాదు మన మనసుల్నీ, మనసులోని భావాల్నీ పంచాయి, పెంచాయి. ఒకరివి ఒకరికి తెలిపాయి.

కానీ ఎందుకో ఈ మధ్య ఏ పనీ చెయ్యనివ్వనంతగా నువ్వే నా ఆలోచనల్లో..! ఎవరితో మాట్లాడుతున్నా లేదా చదువుతున్నా నువ్వు గుర్తొస్తావ్. అంతే..! ఇక ఏ పనీ చేయబుద్ధి కాదు. ఇలాగైతే ఎలా..? ఇది ప్రేమా..? ఇదే ప్రేమైతే నీకు తెలిపేదెలా..?

ఇదంతా నీకు చెప్పాలా..? వద్దా..? ఈ సంఘర్షణంతా 'నీ', 'నా' మధ్యే కదా! మరి నీకు చెప్పకుండా ఉండడం ఎలా..?

అలాగని నేనే నోరు తెరిచి ఎలా చెప్పను..? ఆడపిల్లనై ఉండీ 'నువ్వంటే ఇష్టమని.. ఇష్టానికి మించి ఇంకేదో..' అని నీ ఎదుట నిలిచి చెప్పేంత ధైర్యమా..? నాలో నీ గురించిన భావజాలాన్ని నీకు తెలపడం ఇంత కష్టమా..! ఏదో ఘర్షణ..! నాలో నాకే. మనసుకీ, మస్తిష్కానికీ మధ్య..! ప్రేమ మొలకెత్తడానికి ముందు కూడా మధనం జరుగుతుందా..?

నా భావాల్ని చెప్పలేక, చెప్పకుండా ఉండిపోయిన ఆ క్షణాన.. ఎదురు చూడని స్వప్నంలా నువ్వే నా ఎదుట నిలిచి నా మనసులోని మాటల్ని నీ మాటలుగా చెప్తుంటే ఉన్న చోటనే శిలాప్రతిమనైపోయాను.

నీకు నేనంటే ఇష్టమని నువ్వు నా కళ్ళలోకి చూస్తూ చెప్తుంటే మనసు భారం తీరిపోయినట్లుగా ఎంత హాయి..!

కమ్మిన **కారుమబ్బులు** బరువు తీరేదాకా కరిగి వర్షిస్తాయి. అంతా అయ్యాక ఓ కొత్త వెలుగు.. వస్తూనే అప్పటివరకూ ఉన్న మసక ప్రపంచాన్ని స్పష్టంగా చూపెట్టేంత తేటగా ఉంది నా మది.

నిస్పృహే దిక్కై, బతుకే బరువై ఎండిపోయిన ఆశల్లోంచి నేనున్నానంటూ పంచే ఆత్మవిశ్వాసంలా స్థిరంగా ఉంది నా మనసు..!

ప్రసవ వేదన తర్వాత కన్న బిడ్డని చూసుకున్నప్పుడు పడ్డబాధంతా మరిపించేసేలా ఆ తల్లి కళ్ళలోని ఆనందం... దూది లాంటి అంతే తేలికదనం నా హృదయంలోనూ..!

ప్రేమ కూడా మొలకెత్తేటప్పుడు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మన మదిలో పుట్టింది ప్రేమేనని తెలిశాక, ఆ ప్రేమ హాయిని అనుభవించాక ఎవరం మాత్రం ఎదగనీయకుండా ఉండగలం... ఆ లేత ప్రేమ మొలకని..!

7. తొలిచూపే ప్రేమా...?

మనలో చాలామందిమి మొదటిచూపుకే ప్రేమించేస్తాం. 'ఎందుకని' అనడిగితే 'ప్రేమ పుట్టడానికి కారణాలు అవసరం లేదని' తప్పించుకునే సమాధానం.

కానీ ప్రేమించడానికి కారణం కావాలి. కారణం లేకుండా మొలిచిన ప్రేమలు కాలం పరీక్షలో నిలవవు.

మనం ఎందరినో చూస్తాం. చూపు మరల్చుకుంటాం. కానీ మొదటిసారి అయినా తనని మళ్ళీ మళ్ళీ చూడాలనిపించడంలో ఏ కారణమూ లేకుండా ఉండదేమో..!

తొలిసారి తనని చూడగానే తనలో మనకి నచ్చినదో, ఆకర్షించినదో ఏదో ఒకటుంటుంది. తన వర్ఛస్సో, కళ్ళో, నవ్వో, కళ్ళతో నవ్వడమో, మరింకేదో.. మనని తన వైపుకి ఆకర్షించేస్తుంది. తను ఎవరికి ఎలా ఉన్నా మనకి మాత్రం అద్భుతమే.

మొదటిసారి చూసినప్పుడే.. కలిగిన కలవరంలో ఏ కారణమూ లేకుండా ఉంటుందా..?

కొన్నాళ్ళ సహచర్యంతో తనని ప్రేమిస్తున్నామంటే ఆ ప్రేమలో తన మంచితనం, మనస్తత్వం, నడవడిక మనకు నచ్చాయని. మరి తొలి చూపులోనే కలిగే ప్రేమలో..?

నేస్తం..! మనలో కలిగిన ప్రేమని 'ప్రేమే' అని నిర్ధారించకుండా ఆ ప్రేమకి కారణాన్ని వెతుక్కోగలిగితే.. ఆ కారణమే నిర్ణయిస్తుంది.. మన 'తొలిచూపు ప్రేమ' నిజమో కాదో..!

8. నీకూ నాకూ మధ్య

పగలుకీ, రాత్రికీ మధ్య ఏముందీ..? నీకూ నాకూ మధ్యన కూడా అదేనా..?

అనంతాన్ని అవగాహన చేసుకుని, వెనుకాడని ధైర్యసాహసాలతో జ్వలించే కాంతితో ఉదయించే నువ్వు.. అణువణువూ అంధకారమై నేనే నాకు కనిపించని అయోమయస్థితిలో చీకటిని చుట్టుకుని నిల్చున్న నేను..

మనిద్దరి కలయికెలా సాధ్యం..?

నేనింకా అపనమ్మకంలోనే ఉన్నాను. నన్ను సమీపిస్తూ నువ్వు..!

నీ ఉషఃజ్వాల నన్ను కాంతివంతం చేస్తోంది. నాకూ ఓ రూపం వస్తోంది. నాకు నేను కనిపిస్తున్నాను. నేనే..! ఇప్పటివరకూ చీకట్లో కల్సిపోయి నేనే లేననుకున్న నేను– రెండుగా.. నేనుగా, నీడగా.. నీ నేనుగా, నా నీడగా విడివడుతున్నాను. నాలోనూ ఓ నూతనోత్తేజం..!

నాకు దగ్గరగా వస్తూ.. అతి దగ్గరగా వస్తూ.. ఎదురుగా.. నా మీదుగా నువ్వు. నీ పట్టుదల, నీ గంభీరం, నీ అందం.. అన్నీ నాలోకి ప్రవహిస్తూ.. అదో సంగమం. పగలు, రాత్రిల సమాగమం..! ఎవరికీ కనిపించని అద్భుత సౌందర్యం.. సృష్టి రహస్యం..!

నీకూ, నాకు మధ్య ఏమీలేని నువ్వూ, నేను. నేనే నువ్వు, నువ్వే నేను.

అంతలోనే నన్ను దాటుకుని, నా నుంచి మరలిపోతూ నువ్వు..! కానీ, నేనిక్కడే. సాయంసంధ్య ఇచ్చిన తెలుపు చుక్కల నలుపు చీరని చుట్టుకుంటూ చీకట్లో ఒంటరిగా నేను..!

నువ్వెళ్ళిపోయావ్..! కనీసం నా నీడనైనా నాకు తోడుంచకుండా..!

ఏ ఆశా లేకపోయినా.. ప్రేమే నమ్మకంగా ఎదురు చూస్తుంటాను నువ్వొస్తావని..! వస్తావు కదూ..!

9. ప్రేమలో నువ్వూ, నేను...

దేనికోసమో అన్వేషిస్తున్నట్టు లోతుగా చూసే నీ తేనె కళ్ళంటే ఇష్టం నాకు. విల్లొంపులా మెలికలు తిరిగిన పెదవులూ.. వాటి మధ్య కనీ కనిపించని పళ్ళు.. అవంటే ఇంకొంచెం.

ఎటో చూస్తుంటానా.. ఉండుండీ నీ చూపో, నీ నవ్వో కళ్ళముందు మెదుల్తుంది. నీముఖంలోకి చూస్తాను. అదే నవ్వు. మనసు తృప్తి పడిపోతుంది.

ఏ సాయంత్రమో నాకోసం చూస్తుంటావు. నిన్ను కలవాలన్న ఆత్రుతలో వంకరగా పెట్టుకున్న దోసగింజ బొట్టునో, స్థానభ్రంశమైన కట్టునో సరిచేస్తావు.. అదే చిరునవ్వుతో.

నన్నెప్పుడూ నలుగుర్లో పర్‌ఫెక్ట్‌గా నిలబెట్టాలని నీ కోరిక. నాకోసం నువ్వు పడే శ్రమ, కష్టం కూడా ప్రేమే నీకు. ప్రేమరాహిత్యమంటే మరణం నీకు.

నిన్ను చూశాక తెలుస్తోంది.. అసలైన ప్రేమంటే. ఇంత విశాలమైన, బరువైన ప్రేమ ఈ ప్రపంచంలో ఇప్పుడింత తేలికైపోయిందేం..?

ప్రేమ ఒక్కొక్కరికీ ఒక్కోలా, ఒక్కో అర్థంతో ఉంటుందని నువ్వు చెప్పినప్పుడు అర్థం కాలేదు. ఇప్పుడిప్పుడే అనుభవమౌతోంది.

నాకు ప్రేమంటే నువ్వో, నీ ఊహలో, ప్రకృతో..!

కానీ, నీకు ప్రేమంటే బాధ్యత. ప్రేమించిన వాళ్ళని నవ్వించగలగడం. పొద్దు పొడుపులో, పొద్దుగుంకులో, కష్టసుఖాల్లో నీడగా ఉండగల్గటం..!

నీ దృష్టిలో ప్రేమంటే.. ఊహలే కాదు ఉన్నతంగా ఉండడం, ఉంచడం కూడా..!

10. అందం

నేను బాగుంటాను. నువ్వు నాకంటే బాగుంటావు. కాని పక్కింటి సరోజ ఇంకా బాగుంటుందా..? మరి తనవంకెందుకలా చూశావ్..?

నేనంటే ప్రాణం నీకు. తెల్లని నా కళ్ళంటే మరీనూ. నిజం చెప్పొద్దూ.. నువ్వు చెప్పాకే నా కళ్ళు అందంగా ఉన్నాయనిపించింది. మరి.. సరోజ కళ్ళూ బానే ఉంటాయనుకుంటా..! ఇవన్నీ ఎందుకు..? ఫేస్ టు ఫేస్.. నువ్వు నన్నే చూడాలి. నాతోనే మాట్లాడాలి. నా దగ్గరే నవ్వాలి. డిక్టేటర్నైపోతున్నానా..?

ప్రేమలో నడక నేర్చుకుంటున్నదాన్ని.. తప్పటడుగులు పడడం సహజమేమో..!

ఎన్నో గులాబీలు.. ఎన్నెన్నో రంగుల్లో.. ఎంతో అందమైన గులాబీలు.. బొకేల కొద్దీ గుత్తులు గుత్తులుగా. వాటిలో ఏ భావము, జీవము కనిపించదు. వాటిని చూసీ చూడనట్టు చూసే నీ చూపు తెలుసు నాకు.

కానీ ఇంట్లో నువ్వూ, నేనూ నాటిన పసుపు గులాబీ తొలిమొగ్గ వేసినప్పుడు నీ కళ్ళలోని అపురూపం.. దాని ప్రతి పువ్వుతో నువ్వాడే బాసలు.. నాకుగాక మరెవరికి తెలుసు..!

అందాన్ని చూసే చూపు వేరు, అందమైన మనసుని చూసే చూపు వేరు.

నువ్వు ప్రేమించింది నన్ను.. అంటే నా మనసునే కదూ..! థాంక్ గాడ్.. అందాన్నేమో అనుకున్నాను.

అందాన్ని ప్రేమిస్తే.. అందం ఎక్కడుంటే అక్కడ మాత్రమే ప్రేమ ఉంటుంది. అందం మారితే ప్రేమ మారుతుంది. కానీ నన్ను ప్రేమిస్తే.. నాకులాగా ఎవరుంటారు..? నీ నేను తప్ప..!

11. మరో నేను

ఇల్లు, కాలేజీ.. ఇంట్లో అమ్మా నాన్న, కాలేజీలో లెక్చరర్లు. ఇదే నా ప్రపంచం. నా ప్రపంచం చాలా చిన్నదని, నేనందులోకి ముడుచుకుపోయి అభావంగా బతుకుతున్నాననీ నాకప్పుడు తెలీదు.

“నా గురించి నేను తెలుసుకోవాలని, బంధాల్లోని చర్యలకి ప్రతిగా ‘ఇలా’ స్పందించాలని.. అవన్నీ తెలియడానికి ప్రేమించే మనసుంటే చాలనీ..”

చాలా కొత్తగా, వింతగా అనిపించింది నువ్వు చెప్పింది వింటుంటే. నీ మాటలు విన్నాక పరిశీలించడం నేర్చుకున్నాను. నన్నే కాదు, నా చుట్టూ ఉన్న అందర్నీ, అన్నింటినీ.

వేగుచుక్క మాయమయ్యేలోపే నిద్రలేచి చదువుకుంటే బాగా గుర్తుంటాయంటూ వేకువనే నిద్రలేపే అమ్మ, ‘భోగి మంటలు చలికాలమంతా ఎందుకు వేసుకోమక్కా..?’ అంటూ జవాబు చెప్పలేని ప్రశ్నలడిగే పక్కింటి పండుగాడు, నాకోసం కొత్త సెల్‌ఫోన్ కొని తెచ్చిన నాన్న,.. అందర్లోనూ ఏదో కనీకనిపించని ప్రేమ, అమాయకత్వం, అప్యాయత..!

రాబోయే ప్రీ ఫైనల్స్ కోసం నైటవుట్స్ చేస్తూ సన్నజాతి పందిరి పక్కన కూర్చుని కునుకుపాట్లు పడడం; ట్యూషన్‌కి ఆరు గంటలకే బయల్దేరినా పొగమంచుని ఆస్వాదిస్తూ లేటుగా చేరుకోవడం; ఇంటికి రాగానే అలసట తీరేలా స్నానం చేసి సాయంకాలపు ఆకాశాన్ని చూడడం; పగలంతా లేని ఏదో మత్తు, వింత పరిమళాలు రాత్రవగానే మొదలవడం; వీటన్నింట్లోనూ నిండి ఉన్న అందమైన భావాలు తెలుస్తున్నాయి నాకు.

ఇది వరకు ఇవే సంఘటనలు.. ఇంకా ఎన్నో జరిగుండొచ్చు. కానీ అప్పుడు వాటిలో ఇంత అందం కనిపించలేదేం..?

అందరూ, అన్నీ ఒకప్పటిలాగే ఇప్పుడూ.. అచ్చం అలాగే. మరి మార్పు ఎక్కడ..? నేను మారానా..? నా చూపు మారిందా..? నేను చూసే విధానం మారిందా..?

నేను– అప్పటి నేనును కాదా..? ఇప్పటి నేను ఎవర్ని..? ఆ నేను.. ఈ నేను ఒకటి కాదా..? అప్పుడు కనిపించని ఏదో అందం, అమాయకత్వం, విశాలత్వం, ఇష్టం, ప్రేమలు ఇప్పుడెలా కనిపిస్తున్నాయి..?

నాలో నాకే కొత్తగా ఉన్నాను నేను. నాలోనే ఉన్న ఈ మరో 'నేను' ఎవరు..? ప్రేమ.. 'నేను'లో 'మరో నేను'ను చూపిస్తుందా..?

వేగుచుక్క పరిహాసం
చీకటికి వెలిగి
పగలుకి ఆరే
వీధిలైట్ల కాపీ చూసి

12. వర్ణం

మొన్న సాయంత్రం ఏదో ఆలోచిస్తూ హైవే మీంచి వస్తున్నానా.. ఒక్కసారిగా ఎర్రటి తెర నామీద పడ్డట్టై చుట్టూ చూశాను. ఆకాశమంతా ఎర్రని ఎరుపు. మెరుస్తూన్న ఎర్ర చారికల మధ్య నెమలి కంఠం రంగుల మిశ్రపు నీలవర్ణం..!

ప్రకృతిలో ఎందుకిన్ని వర్ణాలు..? 'రంగు'కి ఇంత ప్రాముఖ్యత ఉందా..?

మనమూ నవరత్నాలంటూ రంగుల్లో, రాళ్ళల్లో 'రాజు'ల్ని వేరు చేశాం.

'నీలాల' సముద్రం.. 'పచ్చల' వనం.. 'కెంపుల' ఉదయిని.. 'ముత్యాల' జాబిల్లి.. 'పుష్యరాగపు' పండుటాకులు.. ప్రకృతిలోనూ నవరత్నాలున్నాయి. కానీ ప్రకృతికి వర్ణాలన్నీ సమానమేనేమో..! లేకపోతే తనకి పచ్చని రంగైన వనంమీద ఇష్టముంటే ఆ వనాన్ని ఎక్కువ ప్రేమగా చూడాలి కానీ, ఎకరాలకి ఎకరాల అడవిని దహించి మసి చెయ్యకూడదు కదా..! పోనీ నీలం రంగుమీద మమకారమైతే నీలాకాశం.. ఎప్పుడూ నీలంగానే ఉండాలిగా..!

ప్రకృతికి అన్ని రంగులూ ఇష్టమే.. అందుకే అన్నింటినీ తనలో ప్రతిబింబిస్తుంది. ఒకదానిలో ఒకటి కలిపేసి చూసుకుంటుంది. వర్ణించలేని వర్ణాలతో ఎప్పుడూ అందంగానే ఉంటుంది.. ప్రకృతి.

కానీ మనలోనే.. వర్ణానికెందుకింత ప్రాముఖ్యత..?

మొన్న నళినిని చూడ్డానికొచ్చిన పెళ్ళి చూపులవాళ్ళు అమ్మాయి నల్లగా ఉంది కాబట్టి 'వద్ద'ని చెప్పి వెళ్ళిపోయారు. వాళ్ళకి నళిని రంగు కావాలిగానీ దాని మనసు అవసరం లేదా..? పాపం.. ఎంత మంచిదో నళిని. 'ఆ దేవుడే నిర్దయగా నల్లరంగునిస్తే ఇక వీళ్ళెంతలే..! పైనున్న వాడికీ పక్షపాతమే' అని బాధ పడింది.

సమానత్వం రావల్సింది మన రంగులోనా..? మన మనసుల్లోనా..?

నాకేదోగా ఉంది. ఎందుకో..! 'నేను నల్లగా ఉంటే నువ్వు నన్ను ఇష్టపడతావా..? నా మీదింత ప్రేమ చూపిస్తావా..?'

ఎన్ని ప్రశ్నలో.. దీనికీ నీ సమాధానం చిరునవ్వుతోనే...

"మనుషులతో ప్రకృతిని పోల్చకు. ఎందుకంటే మనుషులూ ప్రకృతే. ప్రకృతిలో ఒక భాగం ఈ జీవులన్నీ. ఈ రోజు పుడతాం.. రేపు చనిపోతాం. ఎన్నో పువ్వులు, ఎన్నో రంగుల్లో. ఎందరెందరో మనుషులు, మరెన్నెన్నో రంగుల్లో. రంగురంగుల పువ్వుల్లాగే రంగురంగుల మనుషులు. ఇందులో ఎక్కువ తక్కువలేముంది..?

మనం పైపైన ఉన్నదాన్నే చూస్తాం.. మంచైనా, చెడైనా..! అంతరంగాల్లోకి చూసేంత లోతైన ఆలోచన ఉండదు. అందుకే పైకి కనిపించే నళిని రంగునే చూస్తున్నాం. తన హృదయం అనవసరం మనకి. పైకి కనిపించే తామర, కలువల్ని ఎంతో ఇష్టపడతాం. దాని అంతర్భాగంలోని బురదని పట్టించుకోం.

ప్రకృతిలో నల్లగా అంటరానిదానిలా ఉన్నానని చీకటి చిన్నబోదే..! నక్షత్రాల కళ్ళతో మిలమిలా నవ్వుతూ, ప్రపంచం మొత్తానికీ చల్లగాలి లాలి పాడుతూ సేద తీరుస్తుంది.

మనలో చాలామందికి ఎరుపు రంగంటే ఇష్టం. నీలం అంటే, ఆకుపచ్చ అంటే ఇష్టం. కానీ మనం ప్రేమని ఇష్టపడ్డట్టైతే.. మనలో నిజంగా ప్రేమున్నట్లైతే అన్ని రంగుల్నీ ఆస్వాదిస్తాం. అప్పుడు అన్నీ సమానమే మనకి. గులాబీ, గడ్డి పువ్వు కూడా..!

మన్నులోని గడ్డి పువ్వుని సైతం పులకరింతతో కోసి అదే సున్నితత్వంతో దేవుడికి నివేదించగలిగితే అదే ప్రేమ..!"

13. వీడ్కోలింత భారమా..!

అప్పుడే నువ్వెళ్ళిపోతున్నావా..?

నువ్వు రాబోతున్నప్పుడు నేనెదురు చూసిన ప్రతి నిమిషం గంటగా మారి నన్నెంతగా హింసించిందో.. ఇప్పుడు నువ్వెళ్ళబోయే సమయం మేఘాలపై పరుగున వస్తూ అంతే బాధిస్తోంది.

నువ్వు వద్దు వద్దంటున్నా నీ లగేజీ పట్టుకుని నీతో వస్తానా.. స్టేషను వరకే ఆ గంభీరం..!

నాలుగు రోజులుగా కొమ్మ చివర్న నిబ్బరంగా ఉన్న గులాబీని ప్రేమతో సున్నితంగా తాకీ తాకగానే జలజలమంటూ రాలే రేకుల్లా.. నీ చూపు తాకితే చాలు వర్షించేసేలా ఉన్న కళ్ళని మభ్యపెట్టడానికి ఆ దిక్కో ఈ దిక్కో చూపిస్తున్నాను.

నువ్వొచ్చాక ఎన్ని చెప్పాలనుకుని చెప్పలేకపోయానో.. నువ్వెళ్ళిపోతుంటే మరెన్నో చెప్పాలనున్నా పెదవే విడని, పలుకే రాని మూగదాన్నై పోతున్నాను.

నువ్వు మాత్రం నన్నే చూస్తూ.. ఈ కొద్దిక్షణాలైనా కళ్ళనిండా చూసుకోవాలన్నట్టు..!

నిజమే.. కొన్ని నిమిషాలు గడిస్తే నువ్వు నా పక్కనుండవ్. నిన్ను చూడాలంటే ఈ కూసిని క్షణాలేగా..!

కానీ.. ఎలా..? నీమీద కళ్ళు నిలుపుతానా.. అదేమిటో మెదడు బేలగా అయిపోతుంది. **నిన్ను చూడాలని గుండె కరిగొచ్చి గొంతు దాటి బైట పడాలనీ, తన గుండె చప్పుడు నీకు వినిపించాలనీ విశ్వ ప్రయత్నం చేస్తుంది.**

అటు పూర్తిగా బయటకు రాని దుఃఖం.. ఇటు నీ ఎడబాటుని జీర్ణించుకోలేని మస్తిష్కం..

కాలం ఇంత వేగమా..! నువ్వు వచ్చినట్టే లేదు.. అప్పుడే వెళ్ళిపోయావు కూడా..!

బస్సు నిన్ను మోసుకుని తీస్కెళ్ళిపోతోంది.. నాకు దూరంగా.

ఆశ్చర్యం.. కొన్ని క్షణాలక్రితం నువ్వు ఇక్కడే.. నా పక్కనే.. ఈ ప్లాట్‌ఫారం మీదే. కానీ ఇప్పుడు.. నేనొక్కదాన్నే.

ప్రేమలో వీడ్కోలు మనసుకి అనారోగ్యం లాంటిదే. తట్టుకోడానికి, తగ్గడానికి మందు కాలమొక్కటేనేమో..!

నీ జ్ఞాపకాలైనా నన్ను ఓదారుస్తాయనుకుంటే.. అవి నిర్మొహమాటంగా మోయలేని బరువై మదిలో చేరి ఇందాకటి నీ నవ్వు, నీ మాటలు గుర్తుతెస్తూ ఇప్పటి నువ్వు లేనితనాన్ని గుచ్చి చూపిస్తున్నాయ్.

ఒకనాటి తీపి జ్ఞాపకాల్ని ఈనాటి ఒంటరితనంతో పోలుస్తూ, వాటిని చేదుగా మార్చేస్తున్న ఈ 'వీడ్కోలు' ఇంత భారమా..!

14. ప్రేమా..! ప్రేమించకే..!

నాకు సన్నజాజులంటే ఇష్టం. వానలో తడుస్తున్న రెమ్మల్లోని జాజులంటే మరీనూ..!

ఎండలో తిరిగి తిరిగి వచ్చాక చల్లగా గొంతులోకి జారే నీటి చుక్కలంటే ప్రాణం.

పున్నమి సాయంత్రాలు వెన్నెల పక్కల్లో నిద్రరాక తీసే రాగాలూ చాలా ఇష్టం..! ఆ రాగాలు తీసేది నువ్వైతే మరింత ఇష్టం.

పువ్వులన్నా, ఆ పూలను బతికించే నీళ్ళన్నా; ప్రశాంతతనిచ్చే పాటలన్నా, ఆ పాటలు పాడే నువ్వన్నా ఎంత ప్రేమో నాకు. ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను కూడా.

నేను పువ్వుని ప్రేమిస్తాను. నీళ్ళని ప్రేమిస్తాను. నేల, నింగిని ప్రేమిస్తాను. నిన్నూ ప్రేమిస్తాను. కానీ.. పువ్వు, నీళ్ళు, నింగి, నేల నన్ను ప్రేమించవు. నా ప్రేమకై చూడవు. అవి నన్ను ప్రేమించాలని నేనూ కోరుకోను. ఆశ పడను. మరి నాలో.. 'నువ్వూ నన్ను ప్రేమించాలి' అన్న ఆరాటం దేనికి..?

నిన్ను ప్రేమించాను కాబట్టి నువ్వూ నన్ను ప్రేమించాలన్న కాంక్ష ఎందుకు నాలో..?

నేను నిన్ను ప్రేమిస్తే నువ్వూ నన్ను ప్రేమించాలా..? ప్రేమించి తీరాలా..?

నాకోసం, నాకు నచ్చిందని.. నీ మాట నచ్చిందని, నీ పాట నచ్చిందని, నీలోని మృదుత్వం, మందహాసం నచ్చాయని నేను ప్రేమించుకుంటాను వాటిని.

నా ప్రేమకి బదులు తీర్చాలన్నట్టు, ఇచ్చిపుచ్చుకున్నట్టు నువ్వూ నన్ను ప్రేమించాలా..?

'నేను ప్రేమించాను' కాబట్టి 'బదులుగ ప్రేమించాలి' అనేదే ప్రేమైతే.. "ప్రేమా..! నన్ను ప్రేమించకే..!"

15. విరహమంటే...

నిన్ను చూడాలనిపిస్తోంది.

ఏం తోచనట్టుగా.. ప్రపంచమంతా బిజీగా ఉంటే నేను మాత్రమే పనీపాటా ఏమీ చేయనట్టు, గమ్యమే లేనట్టు ఉంది.

నువ్వు నా పక్కన లేవు. నేనొక్కదాన్నే.. నాలోనూ నేనే. నేస్తం..! విరహమంటే నాకు నేనా..?

నువ్వు నాతో లేకుంటే నా జీవితం నాకే ఇంత విసుగ్గా ఉందేం..? ఏదో ఖాళీతనం..! ఎందుకో..?

ఇది వరకు.. నిను చూడకముందు, నిన్ను కలవకముందు.. నా జీవితం చాలా యాంత్రికంగా, అనాలోచితంగానే వెళ్ళిపోయిందిగా. అప్పుడు ఇంతగా పడ్డ మథన అరుదో.. అసలుందో లేదో..!

ఇప్పుడు ఏం చేద్దామన్నా, చూద్దామన్నా నువ్వే. ప్రతీక్షణం నిన్ను చూడాలనే. కానీ.. నీకు మాత్రం ఈ విరహమన్న భావమూ అపురూపమే.

"చూడాలనుంది. సరే.. చూసేశాక..?" అంటే నేనేం చెప్పగలను..?

నేను నిన్ను చూడాలనుకున్నాను గానీ 'చూసేశాక' అన్నంత దూరం వెళ్ళలేదింకా.

"ప్రేమలో నిన్ను చూడాలి, నువ్వు రావాలి అనిపించదురా..! నువ్వు ఎప్పుడూ నాతోనే ఉన్నావు అనిపించేదే ప్రేమ. చూడాలనేది, కావాలనేది మనసు. ఇప్పుడు నన్ను చూడాలనుందన్నావు. నేను వచ్చాక, నన్ను చూశాక.. ప్రతీక్షణం నేను నీ పక్కనే ఉండాలనిపిస్తుంది నీకు. ఈ మనసెప్పుడూ ఇంతే..! ఇప్పుడున్నదాన్ని పట్టించుకోకుండా.. లేనిదాన్నే.. అదెంత స్వల్పమైనదైనా సరే అదే కావాలంటుంది. మనకి కావల్సింది ప్రేమ. మనసు కాదు.

నీ పక్కన నేను లేనని కాదురా.. గడిచి వెళ్ళిపోయే ప్రతీ నిమిషం మనం కలవబోయే రోజుని మన దగ్గరికి తెస్తోందని మర్చిపోకు. మన మధ్య గడువు కరిగిపోతున్నందుకు ఆనందించు.

అక్కడ నువ్వు ఎంత సంతోషంగా ఉంటే ఇక్కడ నేనూనూ.."

నీ మాటలెంత మధురంగా ఉంటాయి..!

నేస్తం..! నీ మాటలు వింటుంటే ఇంత హాయిగా ఉంటుందేం..? నువ్వన్నది నిజమే. ఈ హాయి నీదీ నాదీ కాదు, ప్రేమది.. విరహంలోని ప్రేమది.

విరహమంటే నాలో నేను కాదు. ఇక్కడున్న 'నాలో'.. పక్కనలేని 'నువ్వు'.. నాలో నువ్వు.. నా నువ్వు..!

విరహమంటే నా నువ్వేగా..!



16. ప్రేమ పయనం

ఓ నీలిమేఘం... వెండి మెరుపుతో మెల్లగా సాగిపోతోంది. దాన్ని చూస్తూ చిగురిస్తున్న ఆశతో వెంబడిస్తోంది ఓ చకోరపక్షి. దాహాన్ని తీర్చే ఆ మేఘమంటే ప్రేమ దానికి. మబ్బుల్లోని నీటి చుక్కల కోసం.. సూర్యుని వేడి ధాటికి మాడి రాలిపోయే వరకూ.. ఆ మేఘమాలిక వెనుక సాగడమే దాని గమ్యం.

ఎగిసిపడే ప్రతి అలకీ ఓ ముగింపుంటుంది. ఉవ్వెత్తున అంబరాన్నంటే నేల రాలుతుంది.

ఎదిగిన ప్రతిజీవికీ ఓ అంతముంది. మనసై వెలిగీ మన్నులో కలుస్తుంది.

ఆవిరైన ప్రతి నీటిబొట్టుకీ ఓ లక్ష్యముంది. మబ్బుల్లో ఉండి చినుకై జారుతుంది.

ఇదో ప్రయాణం..! అంతులేని పయనం..!

పుట్టిన ప్రతి జీవికీ మరణం తప్పదు. మరి ప్రేమ..?

ప్రేమ శాశ్వతమా.. అశాశ్వతమా..? ప్రేమ కూడా చచ్చిపోతుందా..?

ఇప్పుడున్న ప్రేమ రేపూ ఉంటుందా..? ఇలా ఎప్పటివరకు.?

ఆ చెట్టు నా చిన్నప్పుడు లేదు. ఇప్పుడుంది. కొన్నాళ్ళో.. కొన్నేళ్ళో దాని జీవితం..! ఆ మబ్బు.. ఆ ఎండ.. ఆ వాన.. ఆ హరివిల్లు.. ఆ చీకటి.. ఆ జ్వాల.. అన్నీ అంతమవ్వాల్సిందేగా. మరి ఇవన్నీ లేనప్పుడు ప్రేమ ఉంటుందా..?

ఇవన్నీ.. ఇవి అన్నీ లేనప్పుడు ప్రేమ ఉండదు. కానీ వీటిలో ఒక్కటున్నా ప్రేమ ఉంటుంది.

నశించిపోయే ఒక్కో తరం నుంచీ మరో తరానికి, ఎండకి ఆవిరై మాయమయ్యే తడిలోంచి చినుకుల్లోకి, రాలిపోయే చినుకుల్లోంచి మట్టిని చేరి అందులోంచి విత్తులోకి, వసంతం నుంచీ శిశిరమై మళ్ళీ గ్రీష్మంలోకి.. ప్రేమ పయనిస్తూనే ఉంటుంది.

ఆ ప్రయాణం ఆగనిది.

నువ్వు, నేను, ఆ చెట్టు, పుట్ట.. ఇవన్నీ లేవని ప్రేమ ఆగిపోదు. మనం మరణించొచ్చు. చెట్టూ చచ్చిపోవచ్చు. కానీ నశించిపోయే ప్రతి దాన్లోంచి ప్రేమ మొలక పుట్టుకొస్తుంది. మన నుంచి తర్వాతి తరానికి, చెట్టులోంచి గింజలోకి.. ప్రేమ భద్రంగా ప్రయాణిస్తూనే ఉంటుంది.

ఆ ప్రేమ పయనాన్నీ.. నిన్ను, నన్ను, ప్రకృతిని, ఈ ప్రపంచం మొత్తాన్నీ ఆ ప్రేమే నడిపిస్తుందనీ తెలుసుకోగలిగితే బహుశా అప్పుడు మనలో ప్రేమ ఉంటుందేమో..!



17. ఏకాంతం కావాలి..!

నా ఊహలు, నా ఆశలు, నా ఆలోచనలు, నా భావోద్వేగాలు.. అన్నిట్లోనూ నువ్వే.

ఇన్నాళ్ళూ.. ఇన్నేళ్ళుగా నా అధీనంలో ఉన్న నా మనసే కాదు.. అన్నీ.. 'నా' అనేదంతా 'నీ'గా మారిపోయిందేమో..!

ఎన్ని.. ఎన్నెన్ని గంటలు..! ఎదురెదురుగ నువ్వు, నేను..!

చేతిలో చెయ్యి.. ఆ గోరువెచ్చని స్పర్శని గుండెకి చేరవేసే హడావిడిలో నరనరమూ..!

నీ తేనె కళ్ళని చూస్తూ.. లోలోపల పొంగే హృదయపు ప్రేమ ధారల ఉరవడిలో పడి మస్తిష్కమూ..!

విడివడని నా పెదవుల్లో.. భాషా భావాల్ని, పలుకుల్ని మరిచిపోయేలా చేసిన మౌనమూ..!

నీ సమక్షంలో నేను పొందే ఆనందం వర్ణించలేనంత..! కానీ అంత ఆనందమూ.. ఆసాంతమూ అనుభవించేదెలా..? నాలో నేనే లేకుండా అణువణువూ నీ స్పర్శానుభూతిలో మునిగి తేలుతుంటే ఆ ప్రేమని.. ఐ మీన్ నీ ప్రేమని అనుభూతించేదెలా..?

అన్ని అవయవాలూ వాటి కర్తవ్యాన్ని మరిచిపోయిన ఆ మైమరపులో ఇంత ప్రేమని, దాని గాఢతని మనసుకు ఎవరు చేరవేస్తారు..?

కళ్ళనిండా నువ్వు నిండిపోతే ఇక ప్రేమనెలా చూడగలను నేను..?

నా ప్రియనేస్తమా..! ప్రేమని కూడా అనుభూతించాలంటే ఏకాంతం కావాలా..?

పగలు నిన్ను చూస్తాను.. నీతో మాట్లాడతాను..

అప్పుడు నాలో కదలాడని ఏదో పులకరింత.. నా గదిలోకి అడుగెయ్యగానే..!

మంచంమీద వాలతానో లేదో మనసు నీ తలపుల్ని, మనం మాత్రమే ఉన్న మన సాన్నిహిత్యాన్ని వెతికి వెతికి ఏర్చి కూర్చి ప్రేమమాల కట్టడంలో లీనమైపోతుంది. నేస్తం..! ఎంత ప్రశాంతతుంటుంది ప్రేమలో..! మనసంతా హాయిగా.. ఏ ఆలోచనలూ ఆ హాయిని కదిలించలేనంత ప్రశాంతంగా శరీరమంతా పరుచుకునుంటుందా ప్రేమ..!

ప్రశాంత వాతావరణంలో ఏ ఆలోచనా లేని ఆ ఏకాంతంలో ప్రేమ అనుభవమౌతుందేమో..!

ప్రేమకి ఏకాంతం అవసరమంటే.. నాకూ ఏకాంతం కావాలి. నేస్తం..! నువ్వు నా చెంతన ఉండగానే నాలోకి.. నా మనసు లోతుల్లోకి చూసుకోగలంత ఏకాంతం కావాలి.

అది.. ప్రేమ, నువ్వు, నేను మాత్రమే ఉండే ఏకాంతం..!

18. నిన్నటంత ప్రేమ

మొదటిసారి నీతో మాట్లాడినప్పుడు నాలో ఉన్న సిగ్గు, బిడియం ఇప్పుడు ఏమైపోయాయి..? నువ్వు నా చేతిని మొదటిసారి తాకినప్పుడు నాలో కలిగిన ఉలికిపాటు ఇప్పుడేది..?

సిగ్గు, భయం, కోపంలాగే ప్రేమ కూడా ఒక భావానికి ప్రతి స్పందనా..? వాటన్నిటిలాగే ప్రేమ కూడా తగ్గిపోతుంటుందా..? కొన్నాళ్ళకి రూపు మాసిపోతుందా..? ప్రేమలో.. ప్రేమించడంలో హెచ్చు తగ్గులుంటాయా..? నీలో నామీది ప్రేమకూడా తగ్గుతుందా..? నువ్వు నన్ను మర్చిపోతావా..?

అప్పుడున్నంత ప్రేమ ఇప్పుడు నీలో నాలో తగ్గిందా..? రోజులు గడిచే కొద్దీ ఆ ప్రేమ తీవ్రత తగ్గుతుందా..? ప్రేమించిన మనిషిని అసలెందుకు దూరం చేసుకుంటాం..? అలా చేసేది నిజమైన ప్రేమేనా..?

బహుశా మనం నిజంగా ప్రేమించమేమో.. 'ప్రేమించాం' అనుకుంటాం.

ప్రేమించాం కాబట్టి ఇలా ఉండాలి. అలా ఉండకూడదు.. ఇది చెయ్యాలి. అది చెయ్యకూడదు.. అని ఆంక్షలు పెడతాం.

ఆంక్షలు పెట్టే మనసులో ప్రేమ ఉండదు. ప్రేమ లేని మనసులో ఏ మధురానుభూతైనా ఎలా ఉంటుంది..?

ప్రేమలోని చిన్నచిన్న ఆనందాల్ని పొందలేని మనసు స్వేచ్ఛ కోల్పోయిన పక్షిలా నిస్సత్తువలో మునిగిపోతుంది. ఆ నిస్సత్తువలోంచి పుట్టుకొస్తుంది ప్రేమమీద నిరాసక్తత..!

కానీ మనలో ఉన్నది ప్రేమే అయితే.. మనలో 'తన' తలపులు నిత్యం నూతనంగానే ఉంటాయి. 'తన' సమక్షంలోనే కాదు.. 'తన' ఎడబాటులోనూ 'తను' మనతోనే ఉన్నట్టుంటుంది.

చల్లని.. హాయి గొలిపే చిరుజల్లుల్లోనే కాదు.. మండుటెండలోనూ గుర్తొస్తాడు తను.

మన మనసు- తొలి సహచర్యంలోని ఉద్వేగాన్ని ఇప్పటి జ్ఞాపకాల్లోనూ అనుభూతిస్తుంది.

అప్పుడు 'నాకు నిన్నటంత.. మొన్నటంత.. మన తొలినాళ్ళంత ప్రేమే ఎప్పటికీ కావాలి' అనుకోను.

ఇప్పుడు.. ఈ క్షణం.. నీ చూపుల్లోంచి, నీ పెదవుల్లోంచి, నీ చేతల్లోంచి జారే ప్రతి చిన్ని ప్రేమభావాన్నీ ఏరుకుంటాను. క్షణక్షణం అదే ప్రేమ జల్లు నామీద కురిపించాలి అనీ, నా ప్రేమాస్వాదనలో నువ్వు తరించాలని, నాకోసం తపించాలనీ ఆత్రుత పడతాను.

ప్రతీక్షణం ప్రేమలోనే.. ప్రేమతోనే జీవిస్తుంటే ఇక నిన్నటంత ప్రేమ, మొన్నటంత ప్రేమ, గడిచిన ఘడియంత ప్రేమ అంటూ ప్రేమని కొలవడానికి తావెక్కడ..?

అదే కొలతలు లేని ప్రేమ..!

19. ప్రేమ అక్షయ పాత్రా...

“మనలో ప్రేమ ఉంది. అయితే..? దాన్ని అలా సాదాగా ఉంచితే ఇక ప్రేమకు అందమేముంది..? ప్రేమకు కొంచెం ఆనందాన్ని చేర్చితే అది జీవితానికే జీవాన్నిస్తుంది.”

నీ మాటలు వింటుంటే అర్థమయ్యీ కానట్టుంటాయి. కానీ నీ ప్రవర్తనలో దాని అర్థం కనిపిస్తే అప్పుడు తెలుస్తుంది ఆ మాటల భావం.

పచ్చని గడ్డిమీద విశ్రాంతిగా కూర్చుని, చల్లగాలిలో చల్లని ఐస్‌క్రీం గొంతులోకి జారుతూ ఒళ్ళంతా జివ్వుమనిపించే పులకింతని ఎంజాయ్ చేస్తూ నేను.. దేన్నో వెతుక్కుంటూ అటూ ఇటూ అల్లిబిల్లిగా పరుగులు పెడుతున్న చిన్న పిల్లిపిల్లని చూస్తూ నువ్వు..!

సైగతో దాన్ని పిలిచి ఐస్‌క్రీం నీ చెప్పులమీద కొంచెం వేస్తే అది మన వంక చూస్తూ తడబడుతూ ఐస్‌క్రీంని నాకడం..; ఉడుతకి వేరుశెనగ గింజల్ని అందించడం..; నువ్వు నాకోసం పంపిన గిఫ్ట్స్, గ్రీటింగ్ కార్డ్స్ అందరి చేతుల్నీ దాటి నాకు చేరినప్పుడు వాళ్ళ కొంటె చూపులు, మాటలు..; నాకోసం వచ్చే హడావుడిలో దెబ్బ తగిలించుకున్న నీ మోచేతి మీది మచ్చ..; మీ వాళ్ళ పెళ్ళిలో నువ్వు నాకిచ్చిన ప్రాముఖ్యత..; అది చూసి అందరి ఆరా..; నీ ముసి ముసి నవ్వుల సిగ్గు చూపులు..;

ఇన్ని మధురానుభూతులుంటాయా ప్రేమలో..!

నువ్విస్తావ్..! ఎద మోయలేనన్ని అనుభూతుల్ని ఇస్తావ్. మదిని మైమరపులో పడేస్తావ్.

ఇన్ని ఆనందాలా.. మనసు పట్టలేకపోతోంది. ఎదగది నిండి పొంగిపోతోంది ఆ మధురానుభవాలతో.

ఒక్కసారి తీరిగ్గా కూర్చుని అవన్నీ తిరగేసుకోవాలనుకుంటాను. 'జీవితానికి ఇన్ని సంతోషాలు చాలు. ఇంకేమీ వద్దు'.. అనుకుంటాను.

కొన్ని రోజులు గడుస్తాయి. ఒక్కో అనుభూతీ మాయమై పోతుంటుంది. గుండె ఖాళీ అయిపోతుంది. 'మళ్ళీ నువ్వు, నీ నవ్వు, నీ సాన్నిహిత్యం కావాలి. ఇంకా బోలెడంత ప్రేమ కావాలి' అనిపిస్తుంది.

మొన్ననేగా– ఇక ఈ జీవితానికి సరిపడా అనుభూతులు దొరికాయి. వాటితో గుండె నిండిపోయిందనుకున్నాను..!

ఇప్పుడేమిటి ఈ ఖాళీ గుండె..!

ఆ తీపి అనుభవాలన్నీ ఏమైపోయాయి..?

నేస్తం..! కొంపదీసి నా గుండెకు గానీ చిల్లు పడిందా..! మరి ఒక్కొక్కటి పోగొట్టుకుని గండె ఖాళీ అయిపోతుందేం..?

లేకపోతే ప్రేమ అక్షయ పాత్రా..! ఎన్ని ప్రేమానుభవాల్ని వేసినా తనలో దాచేసుకుంటుంది..!

౨౦. ప్రేమ భాష

ప్రేమకు భాష ఉంటుందా..?

భావాల్ని తెలిపే భాష.. ఆలోచనల్ని రేపే భాష.. బంధాన్ని పెంచగలదు, తుంచగలదు కూడా కదా..!

మనం ఎంతగా మాట్లాడుకుంటామో అంతే మౌనంగానూ ఉంటాం. మాట్లాడుకుంటే అన్నీ తెలుస్తాయి. మరి మౌనంలో..?

నువ్వు రాగానే చూసే ఆ చూపు.. పలుకు బయటకు రాకపోయినా ఎలా ఉన్నావని పలకరించినట్టే ఉంటుంది. నా కళ్ళేం చెప్తాయో మరి.. జవాబు దొరికినట్టు చిర్నవ్వు నవ్వుతావు.

ఆ సాయంత్రం ఎంతో కోలాహలంగా ఉంటుంది. అవి పండుగ రోజులు. అందరూ ఎవరి హడావుడిలో వారు. నీ కళ్ళు దేన్నో గమనించమన్నట్టు ఆ వైపు చూపెడతాయి. నువ్వు చెప్పింది అర్థమైనట్టే అటువైపు చూశాను.

ఓ చిన్ని పాప.. వాళ్ళమ్మ బూర కొనివ్వనందని చేతులు తపతప కొడుతూ మధ్య మధ్య వాళ్ళమ్మ చీరని లాగి బూరలమ్మేవాడివైపు చూపిస్తోంది.

పాప ఏడుపుకి భాష లేకపోవచ్చు. కానీ భావం నాకర్థమైంది. నా చేతివైపు చూసుకున్నాను. క్షణం క్రితం నువ్వు నా కోసం కొన్న అదే బూర. ఇక సంశయించలేదు నేను. నేనిస్తున్న బూరని తీసుకుంటున్న ఆ బుల్లి ముఖంలోని ఆనందం ఏ భాషకందుతుంది..?

మరో సాయంత్రం.. నేనేదో మాట్లాడుతుంటాను. నువ్వు ఉన్నట్టుండి నా చెయ్యి పట్టుకుంటావు.. కళ్ళు మూసుకుని. పంచేంద్రియాల్ని వినడం మీదే కేంద్రీకరించినట్టుగా అనిపించి నేనూ వినడానికి ప్రయత్నిస్తాను.

ఎక్కడ్నుంచో లీలగా వసంతం రాకముందే కూస్తోన్న కోయిల స్వరం.. చల్లగాలికి చెట్లు చేసే చిరు సవ్వడి నేపథ్య సంగీతంలా..!

మాట్లాడితేనే భావాలు తెలుస్తాయా..? ప్రేమ భావం తెలియాలంటే మాటలొక్కటి చాలా..? లేక ప్రేమకి వేరే భాష ఉంటుందా..?

మన మొదటి పరిచయం.. ఆ పొద్దు కుంగిపోయిన వేళ.. మనం మాట్లాడుకున్నదెక్కడ..? చాలా రోజులు మన భాష మౌనమేగా. అయినా మనలోని ప్రేమ ఒకరికొకరికి ఎలా తెలిసింది..?

ప్రేమకి మాటలే కాదు. మౌనమూ భాషే కదూ..!

నేస్తం..! ప్రేమలో ఒక కనిపించని భాష ఉంటుందేమో. అది ఆ ఇద్దరికీ మాత్రమే తెలుస్తుంది. వాళ్ళ కళ్ళు, చేతులు, కనుపాపలే కాదు అణువణువూ భావాల్ని వ్యక్తీకరిస్తాయి. అవి వారిద్దరికే అర్థమవుతాయి. ప్రేమ భాష ప్రేమించే హృదయానికి మాత్రమే అర్థమవుతుంది.

ప్రేమలో పెదవి విప్పి మాట్లాడకపోయినా ఫర్లేదు. ప్రేమించడం తెలిస్తే మన మనసే మాట్లాడుతుంది.. ప్రేమ భాషలో..!



21. ప్రేమ మోసం చేస్తుందా..?

మొన్నెప్పుడో ఒకర్ని ప్రేమిస్తాం మనం.

'తనే జీవితం' అనుకుంటాం. తనెలా ఉన్నా, తన ఇష్టాయిష్టాలేమైనా వాటిని మనమూ అలవాటు చేసుకోవాలని ప్రయత్నిస్తాం. తనకి నచ్చినట్టు ఉండాలనే ప్రయత్నంలో మన సొంత, స్థిర అభిప్రాయాల్నీ మార్చుకుంటాం. అయినా ఏ చిన్న అభిప్రాయభేదమో తలెత్తుతుంది. దాన్ని సరిచేయలేని అశక్తతకి జత కలుస్తూ మరికొన్ని భిన్నాభిప్రాయాలు..!

వైరుధ్యం మొదలయ్యాక వైమనస్యమూనూ..!

మనసుల అల్లికలో ప్రేమ బిగువు లోపిస్తుంది. దాని వెనుకే వికర్షణ, విముఖత..! ఒకరికొకరం అనుకున్న మనం ఓ చిన్ని కారణంతోనే ఎవరికి వారిమైపోతాం.

నాకు ఎప్పటికీ తోడుంటానని చెప్పిన తను ఇప్పుడిలా వదిలి వెళ్ళిపోవడం..! నా మీద నేనే జాలిపడడం తప్ప ఇంకేం చేయగలను..?

మాట తప్పి నన్ను మోసగించారన్న బాధలోంచి మా బంధం మీద అసహ్యం..! మా మధ్య కలిసిన బంధం ప్రేమ అయినందుకు ప్రేమ మీదా అసహ్యం..!

ఇకపై జీవితంలో ఎవర్నీ.. ఎవ్వర్నీ ప్రేమించకూడదనుకుంటాను. 'ప్రేమ'న్న మాట వినిపిస్తేనే చిరాకుపడతాను. కానీ ఇలా అనుకుని నన్ను నేను సరిపెట్టుకోలేకపోతున్నాను.

ప్రేమ మనల్ని మోసం చేసిందంటూ మనం ప్రేమని నిందిస్తాం. వాస్తవానికి ఆ తప్పు ప్రేమదికాదు.. మనది.

ఆకర్షణకో, అవసరానికో ప్రేమ ముసుగు తగిలించుకున్న 'తన'లోని 'ప్రేమ లేనితనాన్ని' ముందుగానే గుర్తించలేకపోవడం మన తప్పు. అంతకంటే ముఖ్యంగా నన్ను మోసం చేసింది 'తను', 'తన మాటలే' గానీ ప్రేమ కాదు.

నిజంగా ప్రేమే మనల్ని మోసం చేస్తే ప్రేమ మీది ద్వేషం జీవితాంతమూ ఉండాలి. కానీ మనం మళ్ళీ ప్రేమిస్తాం. ఎవరైనా మనల్ని ప్రేమించాలని ఎదురుచూస్తాం. ప్రేమ పొందాలని తపిస్తాం.

ప్రేమని నిందిస్తూనే, మోసపోయాం అనుకుంటూనే మళ్ళీ అలాంటి ప్రేమ కోసం ఏం చెయ్యడానికైనా సిద్ధపడతాం.

ప్రేమది ప్రేమించే గుణం. అందుకే తపించిన చోటల్లా ప్రేమ కురుస్తూనే ఉంటుంది. అలాంటి ప్రేమ మోసం చేస్తుందా..? ఊహు..!

ప్రేమంటే నిజాయితీ..! ప్రాణం పోయే పరిస్థితొచ్చినా ప్రేమించిన వారిని మోసం చేయలేనంత నిజాయితీ..!!



22. ఇవ్వడమా..? తీసుకోవడమా..?

ప్రేమంటే ఇవ్వడమా..? లేక తీసుకోవడమా..?

ఆకాశం అద్భుత చిత్రకారుడిలా ఎరుపుకి మెరుపుని అద్ది మేఘాల అంచులకు తుది మెరుగులు దిద్దుతోంది. దాన్ని చెరపకూడదనుకుంటున్నట్టు నిదానంగా వస్తోంది చీకటి.

ఆ సాయంత్రమంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే నాకు నువ్వు తెలిసింది ఆ సాయంత్రమే. మనిద్దరం కలిసి ఆహ్లాదంగా గడిపిన ఎన్నో సాయంత్రాలు..!

మనం కలిసిన ప్రతి సాయంత్రమూ ఏదో ఒకటి ఇచ్చి వెళ్తావు.

ప్రేమంటే ఇవ్వడమా..? ఎప్పుడూ ఇవ్వడమేనా..?

నువ్వు ఇస్తూనే ఉంటావు– నాకోసం తెచ్చే ఏ వస్తువైనా, నాతో గడపగలిగిన సమయమైనా, నాకు పంచిచ్చే ఆనందమైనా, నీ ప్రేమైనా..! నాకు ఎప్పుడు ఏది కావాలో నీకు బాగా తెలుసు. ఎప్పుడూ ఇస్తూనే ఉంటావు ఏదో ఒకటి.

నువ్వు ఏదిచ్చినా సంతోషంగా తీసుకుంటాను.

ప్రేమంటే తీసుకోవడమా..? ఎప్పుడూ తీసుకోవడమేనా..?

అందుకేనేమో ఇన్ని తీసుకుంటూ 'నీకేమిచ్చానా..' అని ఆలోచించు కుంటాను. 'నీకేం కావాలి..' అని అడుగుతాను నిన్ను.

'నీ ప్రేమ చాలు నాకు' అంటావ్ నువ్వు.

అప్పుడనిపిస్తుంది నేనసలు 'నిన్ను ప్రేమిస్తున్నానా..!' అని. నిజంగా ప్రేమిస్తే నా ఇష్టాయిష్టాలు నీకు తెలిసినట్టే నాకూ నీ ఇష్టం, అయిష్టం తెలుస్తాయిగా..! ఇక నా ఆలోచనలు, నేను చేసే పనులు నీ చుట్టూ తిరగడం మొదలుపెడతాయి. 'నీకేం కావాలో, నీకేం ఇవ్వాలో' అనేదే నా ధ్యాసంతా..!

ఏ చిన్నదైనా అదసలు ఏ విలువా చెయ్యని నా చేతి పిచ్చి గీతల పెయింటింగ్గైనా నా నుండి తీసుకుంటున్నప్పుడు నీ చూపుల్లోని ఇష్టం, తృప్తి నిండిన నీ నవ్వు..!

ఎంత బాగుంటుంది ఇవ్వడం..!

నీ నవ్వు చూస్తుంటే అర్థమవుతోంది నీకు ఇవ్వడమే కాదు తీసుకోవడమూ తెలుసు. అది చేత్తో కాదు మనసుతో తీసుకోవడం.

తీసుకున్నప్పుడు నువ్వు చూపే స్పందన, తృప్తితో మెరిసే నీ కళ్ళు, ఇవ్వడంలోని ఆనందాన్ని తెలిపాయి నాకు.

ముఖస్తుతి కోసం నవ్వుని పులుముకున్నట్టు కాకుండా, ఆనందం నిండిన కళ్ళతో, నీ కోసం ఇచ్చే దేన్నైనా, నా కళ్ళలోకి చూస్తూ అందుకుంటావు చూడూ.. ఆ 'తీసుకోవడాన్ని' మళ్ళీ అనుభూతించడం కోసం ఏదో ఒకటి ఇస్తూనే ఉండాలనిపిస్తుంది నాకు.

ఇవ్వడంవల్ల తీసుకోవడానికీ, తీసుకోవడం వల్ల ఇవ్వడానికీ అందం, అభిమానం పెరుగుతాయేమో..!

నేస్తం..! ప్రేమంటే ఇవ్వడం, తీసుకోవడం, ఇస్తూ తీసుకోవడమే కాదు, తీసుకోగలిగే వరకూ ఇవ్వడం కూడా కదూ..!

ప్రేమంటే ఏంటో తెలిస్తే ఆ ప్రేమని ఇవ్వడమే కాదు.. తీసుకోగలగడం కూడా తెలుస్తుందేమో..!

23. సున్నితత్వం

ఎప్పట్లానే తెల్లారింది. రాత్రంతా రాజ్యమేలిన చీకటి– వెలుగు రాకతో కనుచూపు మేరల్ని దాటిపోతోంది. చీకటిని పారద్రోలాలంటే వెలుగు కావాలి. వెలుగొక్కటే కావాలి.

సన్నగా మొదలవుతున్న కాంతి కిరణాలు శిశిరం మిగిల్చిన మోడులకి ప్రాణం పోయాలన్నట్లు ఆ కాండాల మీదనే ఉండిపోతున్నాయి.

లేతగా చిగురించిన మొక్క ఎదిగిన యవ్వనంలో అలంకరించుకున్న పూరేకుల ఆభరణాల్తో పరిమళించి, ప్రౌఢత్వంలో పిందెల్ని ప్రసవించి, ఏ ఎదురుదెబ్బలకో మోడుబారి, చివరికి ఒంటరిగా మిగిలినా.. దానిలో ఏ మూలనో చిట్టి ఆశల పచ్చదనం మిగుల్చుకుంటుంది. ఎందుకంటే దానికి జీవించడం తెలుసు కాబట్టి.

'జీవితం' అంటే ఏంటో మోడుబారి చిగురించిన ప్రతి చెట్టుకూ తెలుసు. 'జీవించడం' అంటే ఏంటో కొమ్మల్లోని ప్రతి చివురుకీ తెలుసు.

జీవించడం అంటే మనలో సున్నితత్వం ఉండడమే. మళ్ళీ మళ్ళీ మనలో జీవాన్ని నింపుకోగల్గడమే. మన ఆలోచనల్లో, మన మాటల్లో, మనం చేసే పనుల్లో సున్నితత్వం ఉంటే మనలో ప్రేమ భావాలకీ చోటున్నట్లే.

మనల్ని ఎదురుచూపుల్లో నిలబెట్టి, తాపీగా వచ్చిన 'తను' చెప్పే కారణాల్ని, చేసే బుజ్జగింపుల్ని సున్నితత్వంతో చూసి ముసిముసిగా నవ్వ కోగల్గితే అది ప్రేమలో భాగమే.

ఏ దుఃఖంతోనో 'తను' నిర్భావంగా మారిపోతే 'తను' కోల్పోయినదాన్ని తెచ్చివ్వలేకపోయినా.. మన మాటలతో 'మరపు'నిచ్చి, మన చేతులతో తనలో నూతనోత్తేజం నింపగల్గితే ఆ ఓర్పులో, ఓదార్పులో ఉన్నది సున్నితత్వమే..!

తెల్లవారిన తొలిఝాములో చిరునవ్వుని పూయించగల చిన్నమాట, మత్తు వీడక మునుపే చేరే మొదటి పలకరింపు, తను సంతోషంగా ఉండడం కోసం మనం చేసే చిన్ని చిన్ని త్యాగాలు, మనలోని సున్నితత్వాన్నే కాదు మనసులోని ప్రేమనీ ప్రతిబింబిస్తాయి.

మనలో సున్నితత్వం ఉంటే ప్రతి చిన్న భావాన్నీ గమనిస్తాం.

చినుకు రాలుతుంటే చెయ్యి చాపుతాం. కోకిల పాడుతుంటే విని ఆనందిస్తాం. ఏ బిడ్డ బోసినవ్వు చూసినా సున్నితంగా బుగ్గ చిదుముతాం.

గలగలమనే సెలయేరునే కాదు.. నిశ్శబ్దమైపోయిన యేటి గురుతుల్నీ ఆస్వాదిస్తాం.

సున్నితత్వమంటే చిగురుల్నే కాదు.. మోడుని చూసీ ప్రతిస్పందించ గలగడం.

ప్రేమ మొదలవ్వాలంటే సున్నితత్వం కావాలి. సున్నితత్వం ఒక్కటే కావాలి..!

24. ప్రేమ ఒక భావమా..?

'తను' నన్ను మెచ్చుకుంటూ భుజం తడితే వెలిగే కళ్ళలోని మెరుపు పేరు 'సంతోషం'.

ఎదురుచూడని తరుణంలో హఠాత్తుగా ఎదుట నిలిచిన తనని చూసినపుడు నాలో పొంగే భావం 'ఉత్సాహం'.

రాలీరాలని పన్నీరులాంటి చిరుజల్లులో తడుస్తూ మేమిద్దరం కబుర్లలో మునిగి ఇంటివరకూ నడుచుకుంటూ రావడంలో దాగున్న భావం 'ఆనందం'.

ఎన్నెన్నెన్నో భావాలు..! ఎన్నో పోలికలున్నా ఒక దానినొకటి వేరు చేయగల సున్నిత పొర..!

వాటిలాగే ప్రేమ కూడా ఒక భావమా..? అన్ని భావాలలా ప్రేమ కూడా మనలోకి వచ్చి వెళ్ళిపోతుంటుందా..? 'ప్రేమ పుట్టింది' అంటారందరూ. మనలో ప్రేమ ఎప్పుడూ ఉండదా..? అది ఒక సమయంలో మనలో పుడుతుందా..?

మనం అమ్మ కడుపులోంచి పుట్టినప్పుడు మన గురించి, మన భావాల గురించి మనకి తెలీదు. మంచి, చెడు; మనసు, ప్రేమ; పుట్టుక, చావు;.. ఇవన్నీ మనకు తెలియని విషయాలు. ప్రేమని తెలుసుకోవడం చిన్నప్పుడు సాధ్యం కానిది. దానికి మనసుతోపాటు వయసూ కావాలి.

అందుకే వయసొచ్చాక, మనమేంటో మనకి తెలిశాక.. ప్రేమంటే తెలుస్తుంది. మనసు ప్రేమించడం నేర్చుకుంటుంది.

అప్పుడంటాం మనం ప్రేమ పుట్టిందని.

నేస్తం..! ప్రేమ ఒక భావం కాదు. 'భావం' లాగ ఒక నిమిషంలో అది అనుభవమైపోదు.

ప్రేమని అనుభూతిస్తున్నప్పుడు ఎన్నో భావాలు ఏదో కొత్తదనంతో మనల్ని చుట్టేస్తాయి. అన్నీ తెలిసినవే అయినా కొత్తగా, వింతగా, అందంగా కనిపిస్తాయి. ఆ భావాలు, వాటిలోని అందమంతా మనలో ప్రేమ పుట్టాక వచ్చేదే..!

నిజంగా మనలో ప్రేమ పుట్టడమంటూ జరిగితే మనం 'తన'నే కాదు.. అన్నింటినీ ప్రేమించడం మొదలుపెడతాం.. జీవితాన్ని, జీవనాన్ని కూడా.

మనకు బాధ కలిగితే మనలో ఆ బాధొక్కటే ఉంటుంది. సంతోషం కలిగితే ఆ సంతోషంలోనే ఉంటాం మనం. కోపం వస్తే మనలో కోపం తప్ప ఇంకే భావమూ ఉండదు. కానీ మనలో ప్రేమ పుడితే.. దానితోపాటే ఆనందం, సంతోషం, అనురాగం, బాధ, కోపం, విసుగులాంటి భావాలూ కలుగుతాయి.

నేస్తం..! ప్రేమ ఒక భావం కాదు.. ఎన్నో భావాల్ని పుట్టించగలిగేది ప్రేమ.

ప్రేమలోంచి వచ్చే అన్ని భావాల్నీ జయించి ప్రేమనొక్కదాన్ని మనలో నిలుపుకోగలిగితే అదే నిజమైన ప్రేమ.

25. మాటే మంత్రమా..?

నువ్వెంత బాగా మాట్లాడతావ్..!

మాట్లాడడంలో బాగా మాట్లాడ్డం, బాగా మాట్లాడకపోవడం ఉంటాయా..?

మనలో ప్రేముంటే మన మాటలూ ప్రేమంత ప్రేమగా ఉంటాయని నువ్వంటుంటే నవ్వొచ్చింది నాకు. అంటే చిరాకుగా మాట్లాడేవాళ్ళలో ప్రేమలేదనా..?

వేసవి తొలి అడుగులేస్తున్న ఆ సాయంత్రం... చీకటిని కప్పుకునే లోపే ఇల్లు చేరాలని వస్తుంటే, "ఎక్స్‌క్యూజ్‌మి.. ఈ పర్సు మీదేనా..?" అంటారెవరో మనం చేజార్చుకున్న పర్సుని తెచ్చిచ్చి. ఆ సంఘటనని ఎప్పటికీ మర్చిపోం మనం.

ఒక చిన్న సాయానికి మనం ఇచ్చే విలువ చాలా పెద్దది. ఎవరో సాయం చేశారనో, మరేదో ఫేవర్ చేశారనో వాళ్ళని ఎంతో గౌరవిస్తాం. ఆ క్షణమే కాదు.. ఎప్పుడూ..! మనం అందర్నీ గౌరవిస్తాం. అందరికీ విలువిస్తాం. చాలామందిని అభిమానిస్తాం.. ఒక్క మనల్ని ప్రేమించేవారిని తప్ప..!

ఓ క్షణం ఏదో అవసరంలో చిన్న మాటసాయం చేశారనో, ఒకరోజు అభోజనంగా ఉండాల్సొచ్చిన ఆ మధ్యాహ్నవేళ కొలీగ్ తన లంచ్‌ని పంచి ఆకలి తీర్చినందుకో.. మనసులో వాళ్ళకి ఒక స్థానమిస్తాం. వాళ్ళతో మాట్లాడే ప్రతి మాటలో గౌరవభావాల్ని గుప్పిస్తాం. ఆ చిన్న సాయాల్ని మనసులో శిలాఫలకంగా చెక్కుకుని వాళ్ళు కన్పించిన ప్రతిసారీ చిరునవ్వుతో పలకరిస్తాం.

కానీ తన విషయంలో..?

తెలిసీ కొన్నిసార్లు, తెలియకుండా చాలాసార్లు.. తనమీద కోప్పడతాం. మనవాళ్ళేగా పడతారనా..? లేక ప్రేమించావ్ కాబట్టి వదిలి ఎక్కడికెళ్ళ గలవనా..?

'తను' మనల్నెంతగా ప్రేమించినా, మనకోసం తన చిన్ని చిన్ని అభిప్రాయాల్ని ఆనందాలెన్నింటినో కోల్పోయినా వాటిని మనం గుర్తించం. తెలిసీ తెలీనట్టుంటాం. "మనల్ని ప్రేమించినప్పుడు ఆ మాత్రం చేయలేరా..!" అని చాలా సాధారణంగా అనేస్తాం. తను మనకెంతగా సేవ చేసినా, జీవితాంతం మనల్ని పోషించినా.. అందులోని ప్రేమ కనిపించదు మనకళ్ళకి.

రోడ్డున వెళ్ళే ఓ అపరిచితునికి, మన కొలీగ్‌కి, బంధువులకి ఇంకా చాలా మందికి ఇచ్చే విలువ, గౌరవం మనం ప్రేమించిన వాళ్ళకెందుకు ఇవ్వం..?

మనం ప్రేమిస్తాం. కానీ ఆ ప్రేమని నిలబెట్టేది మన మాటలు, చేతలే అని మర్చిపోతాం. ప్రేమించిన మనసుని మాటలతో గాయపరుస్తాం.

నేస్తం..! ప్రేమని పంచాలన్నా, పొందాలన్నా తనకి, మనకి మధ్యన మధ్యవర్తి మాటలే..! ప్రేమని పొందాలంటే ప్రేమే కావాలి. దానికి ప్రేమ పూరిత మాటలొక్కటే దారి.

మనం మనసులో ప్రేమ ఉంచుకుని పైకి ప్రేమ లేకుండా ఎలా మాట్లాడగలం..? మనలో నిజంగా ప్రేముంటే మన మాటలూ ప్రేమగానే ఉంటాయి.. ఎప్పుడూనూ..!

26. ప్రేమతో...

జాబిలి అందాలన్న ఆశ తీరక ఆటు పోట్లయి, ఎగిసిపడి తన నిరాశని చల్లార్చుకుంటుంది... ఆ సముద్రం.

పుడమిపై నిలవాలన్న తృప్తి పొందలేక చినుకుగా నేలని తాకి సంతృప్తి చెందుతుంది.. ఓ నీలిమేఘం.

ఎన్నో ఏళ్ళుగా ఎదురెదురుగా ఉంటున్నా ఒకరినొకరు అందుకోలేని నిస్సహాయతని మరిచిపోవడానికి దిక్కుల అంచుల్లో ఏకమైపోయినట్లు మభ్యపెట్టుకుంటాయి.. ఆ నింగి, ఈ నేల.

అందదనుకున్న ఆనందం చేరువవుతుంటే.. ఆ తృప్తి నిండిన భావం.. ఎలా వర్ణించగలం..?

నింగిలోని ఓ చుక్క రాలిపోతూ అడిగింది "నేనెవర్నో తెలుసా..?" అని. తెలీకపోయినా ఊహల్లో విహరించి, "రాలిపోతున్నావు కాబట్టి ఓటమివా..?" అన్నాను.

"ఊహు..! చంద్రుని ప్రేమకి కరిగి నీలాకాశ మేనినుంచి జారిన మధుర స్వప్నానుభూతిని.." అంటూ మాయమైంది.

చుక్కకోసం నే వెదుకుతుంటే చెక్కిలి మీటింది.. నీ తలపు. నువ్వు కలిశాక ప్రతి భావాన్నీ అనుభూతిస్తూ అనుకుంటాను.. నువ్వు లేకుండా ఇన్నాళ్ళు ఎలా గడిచిపోయిందని..!

ఆలోచిస్తే తెలిసింది.. ఇవే భావాలు నాలో అప్పుడూ ఉన్నాయని. కానీ ఏ గలగలలూ లేని సరోవరంలా, చడీ చప్పుడు చేయక స్తంభించిన గాలిలా, ఘనీభవించి నిర్లిప్తంగా కూర్చున్న నీటిలా, నిశ్చలంగా జీవచ్ఛవాల్లా ఉన్నాయని.

ఒంటరితనమే అలవాటుగా మారిన నేను ఏకాకిగా మిగిలినప్పుడు నీవుగా వచ్చి నన్ను పలకరించి, పరిచయం చేసుకున్నావు.

నిర్భావంగా నిలిచిన నన్ను, నా మనసుని ఆర్ద్రంగా తాకావు.

నువ్వు కురిపించిన ఆత్మీయత వెచ్చదనంలో మంచులా ఘనీభవించి ఉన్న నా మనసు కరుగుతోంది. ఆనందం నీకై పారుతోంది. నాకు, నా మనసుకు చలనం వచ్చింది.

నాలోనూ జీవం నిండిన పచ్చదనం ఉందని తెలుస్తోంది.. నా నవ్వులో, చూపులో తొంగిచూస్తున్న ప్రేమ చివురుల్ని చూశాక. నువ్వు నాకందని నెలవంకని నాకు తెలుసు. అందుకే ప్రియతమా..! నిన్ను చూస్తూ, నీ మాటలు వింటూ ఈ మాత్రమైనా పొందగలిగానని పొంగిపోతున్నాను.

ఇప్పుడు నువ్వు నాకు దూరంగా మరలాల్సిన వేళ వచ్చిందని అర్థమై స్వప్నంలా కరిగిపోతున్నాయి నా ఆశలన్నీ.

కానీ.. మిత్రమా! నేనే కావాలని, జీవితాంతం నాకు తోడుగా నిలవాలని, నా జీవితాన్ని ఆనందంలో ముంచెత్తాలని, నా ఎదుట నీవు నిలబడితే.. నిన్ను స్వాగతించడానికి మసకబారిన కళ్ళతో నుంచున్న నా దగ్గర నాకంటూ ఏముంది.. నీ మీది ప్రేమ తప్ప..!

27. తను ప్రేమించి ఉండకూడదా..?

ఆమెందుకో మనకి బాగా నచ్చుతుంది. కానీ తనెవర్నో ప్రేమించి మోసపోయింది.

కొంచెం నచ్చదు ఆ విషయం మనకి. మన దృష్టిలో ఆమె మోసపోవడం ఆమె తప్పు.

అయినా 'మన ప్రేమ' ముందు ఆమె తప్పు చిన్నగా కనిపించి దాన్ని పక్కన పెట్టేస్తాం.

మన ప్రేమలో ఆమె తలమునకలుగా మునిగాక, మన ఆసరా బంధంతో తన జీవితాన్ని తీగలా అల్లుకున్నాక అప్పుడు గుర్తొస్తుంది మనకి.. అప్పుడెప్పుడో ఆమె 'చెయ్యని తప్పు.'

తనుగా ఎదుగుతుంటే కోరి వెళ్ళి తన జీవితాన్ని మన చేతుల్లోకి తీసుకున్నాక ఇప్పుడు విసిరి పడేసేంతగా మారిపోవడం ప్రేమా..?

మనం ఒకర్ని ప్రేమిస్తాం. ఏ కారణం చేతనో విరమించుకుంటాం. మరొకర్ని ప్రేమిస్తాం. మనకి నచ్చకో, వాళ్ళకి నచ్చకో వేరైపోతాం.

మన జీవితం ఒకరితో స్థిరపడేవరకూ మనసుని ఎక్కడో అక్కడ పారేసుకుంటాం. వెనుదిరిగి వెళ్ళి తెచ్చుకుంటాం. కానీ 'ఆమె' మాత్రం తన మనసుని ఎక్కడా పారేసుకుని ఉండకూడదని, తన గుప్పిట్లోనే బంధించి ఉంచుకొని తీరాలనేది మన మొదటి షరతు.

షరతులు విధించేది ప్రేమా..?

నేస్తం..! ప్రేమంటే ఎవర్నీ ప్రేమించనివారిని ప్రేమించడం కాదు.

'మోసపోవడమే తప్పు' అంటున్న ఈ సమాజంలో 'ఆమె' మళ్ళీ (మన ద్వారా) మోసపోకుండా చూసుకోగల్గడమే ప్రేమ.

అప్పుడు మనం తన ప్రేమని మాత్రమే కాదు, తన జీవితాన్నీ యథాతథంగా స్వీకరిస్తాం. మోసపోయిన తన మనసు గాయాన్ని మాన్పే ప్రయత్నం చేస్తాం. ఆ చేదు జ్ఞాపకాల్ని మన మనసులోంచే కాదు.. తన మనసు మూలల్లోంచీ తుడిచి వెయ్యగలిగితే.. అప్పుడు మనం నిజంగా ప్రేమించినట్టే..!

మనసుకి శిశిరం
భావాల రేకుల్ని రాల్చి,
అగాధాల లోతుల్ని
పూడ్చేద్దాం.

28. ప్రేమని వెతకాలా..?

ఎవర్నైనా ప్రేమించడానికి వాళ్ళకోసం వెతకాలా..? ప్రేమని వెతికి పట్టుకోవాలా..?

మనం.. ప్రేమ పొందాలని ఎవరో తెలీని 'తన' కోసం వెతుకుతాం. తను అందంగా ఉండాలని, ఇంకా అలా ఉండాలి, ఇలా ఉండాలి అని ఎన్నో అనుకుంటాం. ఊహించుకుంటాం.

ఆ ఊహలకి దగ్గరగా ఉన్నవారు కనిపిస్తే వారే 'మన ప్రేమ' అని వెంట తిరగడం మొదలుపెడతాం. వెతికి పట్టుకున్న ఆ ప్రేమని భ్రమపెట్టో, భయపెట్టో సొంతం చేసుకోవాలని చూస్తాం.

కానీ.. నేస్తం..! ప్రేమ వెతికితే దొరకదు. వెతికితే దొరికేది మనం కోరుకున్నది అవుతుంది గానీ ప్రేమవదు.

ప్రేమకోసం ఎక్కడా వెతకనవసరం లేదు. ఎవరి వెంటపడీ తిరగక్కర్లేదు. అది మనం ఎదురుచూడని ఓ క్షణంలో మెరుపులా వస్తుంది.

అప్పుడు తళుక్కుమనే మన కళ్ళో, ఎగిసిపడే మన మనసో పదేపదే తనని చూపిస్తాయి. తననే తలపుకు తెస్తాయి. దోబూచులాడే ఆ ప్రేమని గుర్తించాలంటే మనలోనూ ప్రేమ ఉండి తీరాలి.

నేస్తం..! ప్రేమ ఎక్కడో దూరంగా ఉండదు. మన చుట్టూనే ఉంటుంది.

ఒక్కసారి కళ్ళు మూసుకుని మనసు తలుపులు తీస్తే స్వేచ్ఛగా ఎగిరే సీతాకోకచిలుకలా మన మదిలో తన ప్రేమ రూపం కదలాడుతుంది. దాన్ని పట్టుకోవాలని చూస్తే పారిపోతుంది.

కానీ.. మనమే గనుక ప్రేమతో జీవించగలిగితే ఆ ప్రేమే వస్తుంది మనల్ని వెతుక్కుంటూ..!

29. ప్రేమ కలలు

నిన్నో, మొన్నో, నా మదిలో గుచ్చుకున్న తన నవ్వుకోసం ఎంతగా వెతుకుతానో... అంత అన్వేషణ మిగిలే ప్రతీక్షణం– ఓ జ్ఞాపకమై మనసు మూలల్లో చేరిపోతే, నిద్రరాని ఆ అర్ధరాత్రిలో తననే తలుచుకుంటూ... తను కలగా ఎప్పుడు మారిపోయాడోనని ఉలిక్కిపాటుతో మేలుకుంటూ, మత్తూ మెలకువా కాని ఆ స్థితిలో... 'తను పక్కనే ఉంటే ఎంత బాగుండు' అనుకున్న వేకువలు రెపరెపలాడుతూ తిరిగిపోతున్న పేజీల్లా..

ఎన్నెన్ని వేకువ కలువలవి..!

ఇంత పెద్ద ప్రపంచంలో ఏ మూలనో ఓ చిన్ని పూరిల్లులోనైనా తనూ నేను కలిసుంటే చాలనుకునే చిన్ని చిన్ని ఆశల నక్షత్రాలు..!

తోడైనా, నీడైనా, తల్లయినా, తండ్రయినా తనే అనిపించేంతగా అనురాగ భావాల హరివిల్లులు..!

నేస్తం..! ప్రేమలో కలలు కంపల్సరీయా..?

అవునేమో..

ఎందుకంటే ప్రేమ పలకరింపులు మొదట మొదలయ్యేది కలలలోనే. మనని మన ఆశ(యా)ల వైపు నడిపించేది ఆ ప్రేమ కలలే.

మన జీవితానికి 'తను' ఓ అందమైన కల. దాన్ని నిజం చేసుకునే వైపే మన అడుగులు..!

౩౦. ప్రేమలో కోరిక ఉంటుందా..?

తనమీద మనసుపడి తననుంచి అపరిమితమైన ప్రేమని పొందాక అర్థం కాని ఇంకేదో కావాలని ఆరాటపడతాం.

సున్నితమైన తన తనువుని తాకాలనో, సజలంగా మెరిసే తన కళ్ళని చుంబించాలనో, చిరుగాలికి అలరారే నల్లటి ఒత్తయిన తన జుట్టుని సవరించాలనో.. మరేవో వింతైన కోరికలు ఉండుండీ తళుక్కుమంటాయి.

ఆ భావాలన్నింటినీ నిన్నగాక మొన్న పరిచయమైన తనకి మాత్రమే విన్నవించుకోవాలన్నంత దగ్గరి తనవేదో తనకి, మనకి మధ్య ఉన్నట్టుంటుంది.

మన కోరికల్ని తనతో ఎక్స్‌ప్రెస్ చెయ్యకుండా ఉండలేని ఓ క్షణంలో అనిపిస్తుంది.. 'ప్రేమలో కోరిక ఉంటుందా..?' అని.

మనం చిన్నప్పుడు మనల్ని ఇష్టంగా పెంచారని అమ్మా నాన్నల్ని, ఎదిగే వయసులో మన భావాలకి తోడయ్యారని నేస్తాల్ని, మన 'భవిష్యత్ జ్యోతులు' అన్న నమ్మకంతో మన పిల్లల్ని ప్రేమిస్తాం.

మరి తనని ప్రేమించడంలో..?

ఇష్టం, తోడు, నమ్మకాలతో పాటు 'వాంఛ' కూడా కలగలిసి ఉంటుంది. అది మనల్ని కని, పెంచిన తల్లీదండ్రులతోనో, మన స్నేహితులతోనో, సహచరులతోనో పంచుకునేది కాదు. తనతో.. తనొక్కరితో మాత్రమే పంచుకునే అద్భుతమైన అనుభూతి 'కోరిక'.

అందుకే తనమీద కలిగిన ప్రేమలో మన శరీరమే కాదు, జీవితమూ ముడిపడిపోతుంది.

వాంఛ కలగలిసిన ఈ ప్రేమ సఫలమైతే జీవితం ఎప్పుడూ చివురులతోనే ఉంటుంది. కానీ ఇదే ప్రేమ విఫలమైతే జీవితం జీవచ్ఛవమైపోతుంది.

ప్రేమలో వాంఛ ఉండడం తప్పు కాదు. కానీ ఆ వాంఛే ప్రధానమై ప్రేమని పోగొట్టుకోవడమే ప్రేమించే మనసులు చేసే తప్పు.

నేస్తం..! 'కోరిక' ప్రేమని పోగొట్టుకొనేదిలా కాదు.. పెంచేదిగా ఉండాలి.

సూరీడుకీ ఉందట
ఓ అభిసారిక
పొద్దు తిరుగుడు
అమర ప్రేమిక

31. విజాతి ప్రేమ

ప్రేమంటే.. నువ్వూ, నేను ఒక్కలాగే ఆలోచించడమా..?

ప్రేమంటే ఇద్దరి అభిరుచులు, అలవాట్లు ఇష్టాయిష్టాలు ఒక్కలాగే ఉండడమా..?

మరి మనిద్దరం భిన్నంగా ఉన్నామేం..?

నీకు అర్ధరాత్రిలో పడుకుని పొద్దెక్కిన ఏ ఘడియకో మేలుకోవడం ఇష్టం. నాకు చీకటితోనే నిద్రపోయి వేకువతో లేవడం ఇష్టం. నీకు పాడడం, ఆడడం, అల్లరి చేయడం, ఆట పట్టించడం ఇష్టం. నాకు వినడం, చూడడం, నిశ్శబ్దం ఇష్టం.

నాకు ముదురు రంగులు నచ్చుతాయి. నీకు లేత రంగులే ఇష్టం. నా ఇష్టాలు నీకు పూర్తి అయిష్టం. అయినా నీకు ఇష్టం లేని, నాకు నచ్చిన దేన్నో ఆనందంగా తెచ్చి నా చేతిలో పెడతావు.

అలసి ఏ అర్ధరాత్రికో కునుకు పట్టినా వేకువలో నన్ను చూడాలని బలవంతాన రెప్పల్ని విడదీస్తావు. నేను గ్రీష్మ తాపంలా చిటపటలాడుతుంటే నువ్వు నవ్వుల చినుకులతో తడిపేస్తావ్.

మన అభిరుచులు కలవనందుకు ఏనాడూ మనం బాధపడలేదు. ఎందుకంటే నాకు నువ్విష్టం. నీ ఇష్టాయిష్టాలు కాదు. నువ్వు దేన్నైనా ఇష్టపడచ్చు. నీ ఇష్టం ఏదైనా కావచ్చు. కానీ నాకు నువ్విష్టం.

నేను ప్రేమించింది నీ ఇష్టాలనో, అయిష్టాలనో కాదు.. నిన్ను. అందుకే నీ 'ఇష్టం' ఏదైనా అది 'నీది' కాబట్టి నాకూ ఇష్టం.

నేస్తం..! ఎవరన్నారు.. 'ప్రేమలో ఇద్దరి అభిరుచులు కలవాలని'. కానీ ప్రేమలో భిన్న మనస్తత్వాలు ఆకర్షించుకుంటాయి కదూ..!

32. ప్రేమేనా...?

తనంటే ఇష్టం మనకి. తనని గుండెల్లో పెట్టుకుని పూజించేస్తాం. తనతో ఓ నిముషం మాట్లాడినా, తానుగా వచ్చి మనల్ని పలకరించినా మన జన్మ ధన్యమనుకుంటాం.

తను తిని పారేసిన చాక్లెట్ కాగితాన్ని, వాడి విసిరేసిన రీఫిల్ గొట్టాన్నీ, తనను తాకిన ప్రతి వస్తువునీ... పరవశంగా తీసుకుని పవిత్రంగా దాచుకుంటాం.

తననీ, తనకు చెందిన అన్నింటినీ... తనను ప్రేమించినంతగా ప్రేమించేస్తాం. ఇదంతా ప్రేమేనా...?

తననే చూస్తూ, తన వెంటే వెళ్తూ, తనకోసం ఏం చెయ్యడానికైనా ముందుంటూ, ఏ క్షణంలోనో మన ప్రేమకి తలవంచే తన చూపుకోసం ప్రతీక్షణం ఎదురు చూస్తుంటాం.

ఆ క్షణం వచ్చాక..? మన ప్రేమకి తన అంగీకారం తెలిపాక..?

తను ఇక మన సొంతమైపోతుంది... మన పెన్నులాగ, పేపర్‌లాగ, మన షూ లాగ..!

ఇంక... తన వెంట తిరగాల్సిన అవసరం ఉండదు మనకి.. తననే అక్కడికో, ఇక్కడికో రమ్మంటాం. తను గలగలా నవ్వితే.. అది తన ఫ్రెండ్‌తోనైనా... 'ఎందుకింతలా నవ్వావనే' ఆరా కావాలి మనకి. తను ఏ క్షణం ఏం చేసినా, ఎటు వెళ్లినా 'ఏం చేస్తాను, ఎటు వెళ్తాను' అన్న టైంటేబుల్‌ని మనకి ముందుగానే ఇవ్వాలి.

కొన్ని రోజుల క్రితం వరకు మనమెవరో తెలీదు తనకి.

కానీ మన ప్రేమను అంగీకరించినందుకు...

ఇప్పుడు తను, తనదన్నదంతా, అన్నీ మన అధీనంలో ఉండాలి. తన స్వేచ్ఛని మన చేతుల్లో పెట్టాలి. మన ఆంక్షల్ని మనస్ఫూర్తిగా పాటించాలి. ఇదీ ప్రేమేనా...?

నేస్తం..! ప్రేమంటే పారేసిన చాక్లెట్ కాగితాల్ని, రీఫిల్స్‌ని ఏరుకుని దాచుకోవడం కాదు. నెచ్చెలి గుణగణాల్ని ఏరుకోవడం, అందులోని లోపాల్ని దాచుకోగల్గడం.

ప్రేమంటే వెంట తిరగడం కాదు... జీవితాంతం వెన్నంటి ఉండగలగడం..!

అమ్మా నాన్న రూపాయి
మమ్మీ డాడీ డాలర్
మారుతోంది కాలమా..?
మనమా..?

33. ఎప్పటికీ ప్రేమించాలా..?

తనని ప్రేమిస్తున్నామని చెప్పాం మనం అప్పుడెప్పుడో.

అంటే ఆ క్షణం ప్రేమిస్తున్నామనా..? ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటామనా..?

తనకూ మనకూ ఏదో ప్రత్యేక సంబంధం ఉందనిపించిన ఆ క్షణాలు... మన ఆలోచనల్నిండా తననే నింపేస్తాయి. మనలోని ప్రేమావేశాన్ని తన ముందు వ్యక్తం చెయ్యడానికి ఎన్నో చేస్తాం. ప్రతి రోజునీ ప్రత్యేకంగా మలుస్తాం. ఏ విశేషమూ లేకపోయినా సెలబ్రేట్ చేసుకున్న 'అకేషన్ ఆఫ్ నో అకేషన్'లు ఎన్నెన్నో.

రోజులు సంవత్సరాలై మన ప్రేమ పెళ్ళిగా ముడిపడ్డాక...? మన ఆలోచనల్నిండా తనేనా..? తనకీ మనకీ మధ్య గడిచే ప్రతిరోజూ ప్రత్యేకంగా ఉంటుందా..?

ఉండదేమో..!

365 రోజుల్లో ఏ మూలనో దాక్కున్న తన పుట్టినరోజునో మరే ప్రత్యేకమైన రోజుల్నో మర్చిపోయి, తనతో గుర్తు చేయించుకున్నాక ఆ రోజు మాత్రమే గుండెల్లో ప్రేమ పొంగుతున్నట్లు తనకో అందమైన కానుకిచ్చి మళ్ళీ మామూలు జీవితంలో పడిపోవడం ప్రేమా..?

మనం ప్రేమించే తొలి రోజుల్లో.. ప్రతి రోజునీ ప్రత్యేకంగా చేస్తాం. పెళ్ళయిన తరువాత.. ప్రత్యేకమైన రోజుల్నీ ప్రతిరోజులా చూస్తాం.

మనం ప్రేమిస్తాం. ఆ క్షణం ప్రేమించామని భావిస్తాం. ప్రేమించడమంటే ఆ క్షణం మాత్రమే కాదు.. మన మనసులో మన ఆలోచనలే లేకుండా ఎప్పుడూ తన ఆలోచనలే నిండిపోవడం.

అప్పుడు మర్చిపోవడం ఉండదు.. ఎదురుచూడడమే ఉంటుంది.

34. అతనూ, నేను

నేను శిశిరమై నిల్చుంటానా... సుడిగాలై వచ్చి నాలోని సిగ్గుటాకుల్ని రాల్చిపడేసి నన్ను చుట్టుకుపోతాడు అతను.

వసంతపు రంగుల పూవై విచ్చుకుంటుంటే తుమ్మెదై నాపై తూలిపోతాడు.

మల్లెల మత్తు పరుచుకునే సంధ్యవేళనై వెలుగుతున్న నన్ను వెన్నెల తాపంతో వెంటపడి అందుకోవాలని చూస్తాడు.

కోయిల స్వరాన్ని మించిన మృదుత్వంతో పలుకులే స్పర్శై స్పృశిస్తాడు.

తన చేతుల్లో ప్రేమను మించిన మరిదేన్నో నింపుకుని ఆమూలాగ్రం అభిషేకిస్తాడు.

మత్తో, మైకమో తెలీని పరవశంలో పడేసి నా ఆలోచనల్ని అనుభవాలన్నింటినీ ఖాళీ చేసేస్తాడు.

తమకాన్ని తాకిన తనువు తరంగమౌతుంటే మరిలిపోతున్న అల లాక్కెళ్ళే ఇసుకలాంటి ఆనందాన్ని జారిపోనివ్వకుండా దోసిళ్ళతో తెచ్చి అణువణువులో నింపేస్తాడు.

తొలి అడుగుల స్పర్శే కాదు.. తుది మలుపుల అంతంలోని ఆనందమూ అనిర్వచనీయమే..!

ప్రేమలోని ఆఖరిమజిలీ ఇంత బాగుంటుందా..!

ఆ క్షణం అతడే నేను. నేనే అతడు.

అతని చేయి పట్టుకుని దాటుతున్న ప్రతి మజిలీ మనసుకి కొత్త ప్రేమని రుచి చూపుతోంది.

మళ్ళీ మళ్ళీ మొగ్గ తొడిగే చివురుల్లా మజిలీ మజిలీకి నూతనోత్సాహంతో మదిలో పొంగుతున్న ప్రేమ..!

అతనికి నేను కావాలి. నాకు అతను కావాలి. మాకు ప్రేమ కావాలి. అది ప్రతీ క్షణంలోనూ... ప్రతి శ్వాసలోనూ..!

ఆకు వక్క సోడా
ఎర్రదనం
నేలా నీరూ విత్తు
పచ్చదనం

35. అందమైన ప్రేమ

ఇంకా విడివడని చీకటి పువ్వు నల్లరేకులు- వెలుగు పుప్పొడిని పూర్తిగా పట్టి ఉంచలేకపోతున్న ఆ ఉషోదయం ఎంత అందంగా ఉంటుంది..!

అందంగా ఉన్నది... అది ఏదైనా... ప్రకృతో, పువ్వో, పక్షో, మలిపొద్దో... మనందరికీ నచ్చుతుంది.

అందంగా ఉన్నదాన్నే మనమెందుకు ఇష్టపడతాం..? ప్రేమిస్తాం..?

ప్రేమకి అందం అవసరమా..? అందంగా లేకపోతే ప్రేమించలేమా..?

విచ్చుకున్న పూవు అందంతో, పరిమళంతో మనల్ని ఆకట్టు కుంటుంది. ఒక్కరాత్రే దాని జీవితం. వాడిపోయి అందాన్ని కోల్పోయినా దాని సుగంధానికి దాసులమై చెంతనే ఉంచుకుంటాం దాన్ని... దానిలోని పరిమళం పోయేదాకా.

మరి మనుషుల్లో చెంతనుండాలనిపించే పరిమళం..?

ఆ పరిమళమే మనలో ఉండే ప్రేమ, ప్రేమించే గుణం.

'తన'కి అందం లేకపోయినా మనమెందుకో తన సన్నిధినే ఇష్టపడతాం. తనతో కలిసుంటే మన మనసు తేలికైపోతుంది. అప్పుడు మన కళ్ళకి తన 'అందం లేకపోవడమూ' అందంగానే కనిపిస్తుంది.

దానిక్కారణం మన ఉదారతో, మన ప్రేమో కాదు. తనలోని ప్రేమంచే మనసు.

ప్రేమించే మనసు లేని అందం... పరిమళం లేని అందమైన పువ్వులాంటిది. ఆ పువ్వుని అందరూ చూస్తారు. కొందరు దాన్ని దగ్గరకు తీసుకున్నా... అది దానిలోని అందం పోయేవరకే..!

మనకి అందం లేకపోయినా మనలో ప్రేమించే గుణం ఉంటే చాలు. అదే 'తన'ని మనకు చేరువ చేస్తుంది.

నేస్తం..! ప్రేమించ(బడ)డానికి కావల్సింది అందమైన ముఖం కాదు... అందమైన ప్రేమించే మనసు..!



36. నీ ప్రేమ, నా ప్రేమ

తనో, మనమో జీవిత బంధంలో ఏకమవక ముందు ఎవరినో ప్రేమించి ఉంటాం. లేదా ప్రేమించబడి ఉంటాం.

అది అనుభవంలో ఉన్నప్పుడు ఆనందాన్నో, బాధనో మిగిల్చినా ప్రస్తుతానికి మాత్రం మనకి అదో జ్ఞాపకం.

'తన' పాత జ్ఞాపకం మనకి తెలియక ముందుకి, తెలిసిన తర్వాతకి మనలో ఎందుకు మార్పు వస్తుంది..? తన జ్ఞాపకాలు మనకి చేదుగా తోస్తాయెందుకు..?

గతంలో మనకీ ఓ ప్రేమకథ ఉండి ఉండవచ్చు కదా..! అది పట్టించుకోని మనం తన విషయంలో మటుకు ఎందుకు అంతలా ఫీలైపోతాం..?

అందులోనే ఉంటూ ఇద్దరి మధ్య ఓ గీత గీసుకుని మన అనుమానాల్లో మనం, తన ఆలోచనల్లో తను మునిగిపోతాం.

అప్పుడు మనకి గుర్తుండేది ఇద్దరం ఒక్కటే అనుకున్న మన బంధం కాదు... నీ పాత ప్రేమ, నా పాత ప్రేమలే..!

అవి ఇప్పుడంత అవసరమా..? ఎవ్వరికైనా గతం ఓ జ్ఞాపకమే..! అలాంటి గతం తన విషయంలో బాధని మిగిల్చితే దాన్ని మనమూ పంచుకుని తనకి మనమున్నామని చెప్పగలగడమే ప్రేమ. తన జ్ఞాపకం ఓ అనుభూతైతే దాన్నీ మనం ఆస్వాదించగలగడమే ప్రేమ.

మనం చూడాల్సింది తన ప్రేమ జ్ఞాపకాల్నో, మన ప్రేమ గురుతుల్నో కాదు... తనూ మనం కలిసి గడపాల్సిన జీవితాన్ని.

నేస్తం..! మనం జీవించాల్సింది జ్ఞాపకాల్లో కాదు.. ప్రస్తుతంలో..!

37. ప్రేమెక్కడుంటుంది..?

ప్రేమ మనసులో ఉంటుందా..? మనిషిలో ఉంటుందా..? మాటల్లో ఉంటుందా..?

'నా మనసుకు తను నచ్చింది. తనంటే ప్రేమ' అంటాం మనం. అంటే మనసులో ఉంటుందా ప్రేమ..?

మనలో ప్రేమున్నా లేకపోయినా తనలో ప్రేముండాలని, మనల్ని ప్రేమించాలని అనుకుంటాం మనం. అంటే ప్రేమ మనిషిలో ఉంటుందా..?

మనం ప్రేమించిన వాళ్ళతో ప్రేమగా మాట్లాడతాం. అంటే మాటల్లో ఉంటుందా ప్రేమ..?

నేస్తం..! ప్రేమ లేని చోటంటూ ఉండదు.

తనకోసం వేచి చూసే కన్నుల్లో ప్రేమ ఉంటుంది.

పరుగులు తీసే పిల్లగాలికి చల్లనైన మల్లెల సుగంధమంటే ప్రేమ. పగలంతా పడిన అలసటకి కమ్ముకొచ్చే చీకటంటే ప్రేమ. నెర్రలే నగలైన నేలకి ఒళ్ళంతా తడిమే జల్లంటే ప్రేమ.

ప్రతి చిగురుకీ పచ్చరంగుని పూసే ప్రకృతికి పచ్చదనమంటే ప్రేమ.

మన చుట్టూ ప్రేమ కనిపిస్తుంటే ప్రేమని అక్కడో, ఇక్కడో మాత్రమే ఉంటుందని చెప్పలేం.

ప్రకృతిలోనే కాదు.. మనలో, మన మనసులో, మన మాటల్లోనూ ప్రేమ ఉండాలి.

నీలోనూ, నీ మనసులోనూ, నీ మాటల్లోనూ... అన్నింట్లోనూ కలగలిసి ఉంటేనే అది నిజమైన, పరిపూర్ణమైన ప్రేమ.

38. ప్రకృతి - ప్రేమ

ప్రకృతిలో ప్రేమ ఉంటుందా..? లేక ప్రేమలో ప్రకృతి ఉంటుందా..? అసలీ రెండిటికీ సంబంధం ఉందా..?

వసంతం వెళ్ళిపోతూ మిగిల్చిన వడగాలిలో సేదదీరమని మధురఫలాలనెన్నో ఇచ్చింది ప్రకృతి. మనమంటే ఎంత ప్రేమ ప్రకృతికి..!

తనకీ మనకీ మధ్య ఎంత ప్రేమున్నా తనని ప్రేమించిన మొదటి రోజుల్లో అద్భుతంగా ఉన్న ఆ అనుభూతి రాన్రానూ పరిమళాన్ని కోల్పోయినట్టుగా అనిపిస్తుంది.. మనకే కాదు తనకీనూ.

ఆ పరిమళాన్ని పూరించగల శక్తి ఏ ఎంటర్‌టైన్‌మెంట్‌కీ లేదు... ఒక్క ప్రకృతికి తప్ప. అందుకే మనసుల్లో మధురత్వం నింపడానికి ప్రకృతికి పయనమవుతాం.

అందం, ఆనందం, అంతం, అనంతం, శబ్దం, నిశ్శబ్దం... అన్నీ అదే అయిన ప్రకృతిలో తనూ మనం అలై, గాలై, ఆటై, పాటై, పూవై, తుమ్మెదై, ప్రకృతిలో ఏకమైపోతాం.

నిన్నటివరకూ నిస్తేజంగా ఉన్న మనసులు ఇప్పుడే జీవాన్ని పొందినట్లు ఎంత చైతన్యం వాటిలో...! ఇప్పుడు మనకి లోకమంటే తనూ, మనమే.

ప్రకృతిలో ఉన్నది కొద్ది గంటలే అయినా తిరిగి రావాలనిపించని బంధమేదో మనల్ని అల్లుకుంటుంటే అప్పుడు అర్థమవుతుంది మనకి... 'ప్రేమ', 'ప్రకృతి'లు వేరువేరుగా కనిపిస్తున్నా అవి రెండూ ఒక్కటేనని.

తనేమో ప్రేమ, నేను ప్రకృతి..!

ప్రకృతి, ప్రేమలంత గాఢంగా మళ్ళీ బలపడుతున్న మా ప్రేమ బంధం..!!

39. ప్రేమ విలువ

మండే ఎండలో వెళ్తున్నప్పుడే వాన విలువ తెలుస్తుంది. మంచులో వణుకుతున్నప్పుడే ఎండ విలువ తెలుస్తుంది.

విలువ తెలిసేది రాహిత్యంలోనేనా...?

తన గురించి మనకి బాగా తెలుసు. తన సాన్నిహిత్యంలో కంటే తన ఎడబాటులోనే తన గురించి ఇంకా ఎక్కువ తెలుసుకోగలుగుతా మెందుకో..!

తను మన పక్కనున్నప్పుడు అసంకల్పితంగానో, అనుకోకుండానో మాట జారతాం. గొడవలాడతాం. తనకు దూరంగా ఉన్నప్పుడు మాత్రం అలా అనకుండా ఉండాల్సింది, ఇలా చేయకుండా ఉండాల్సింది... అని పశ్చాత్తాపపడతాం.

తన సన్నిధిలో తన గురించి ఆలోచించని మనం తన ఎడబాటులో తన గురించే మథన పడతాం. తనకో, తన మాటకో విలువ ఇవ్వలేక పోయామని చింతిస్తాం.

విలువ ఇవ్వలేని మనలో ప్రేమా ఉండదని గ్రహించలేం.

ప్రేమ విలువ ప్రేమిస్తున్నప్పటి కంటే ప్రేమరాహిత్యంలోనే బాగా తెలుస్తుందేమో..!

నేస్తం..! విలువుండే చోటే ప్రేమ ఉంటుంది. ప్రేమ విలువ తెలిస్తేనే ప్రేమించిన వాళ్ళకీ విలువివ్వగలుగుతాం.

40. ప్రేమించడం నేర్చుకోవాలా...?

తను మనకు పరిచయమయ్యేవరకూ మన ఊహాలోకానికి మనమే మహారాజులం.

మన ధ్యాసంతా ఆటపాటల అల్లరి మీదే..! వాటి మధ్య ఏళ్ళుగా ఎదుగుతాం. అప్పుడంతా నేర్చుకోవడమే ఉంటుంది. పుస్తకాల నుంచే కాదు పెద్దల నుంచీ, చుట్టూ ఉన్న ప్రపంచం నుంచీ చాలా నేర్చుకుంటాం. నేర్చు కుంటూనే ఉంటాం.

మరి ప్రేమించడమూ నేర్చుకోవాలా..?

అనుకోకుండా కలిసిన తన సాన్నిహిత్యం మనకెన్నో నేర్పుతుంది. కొత్త కొత్త భావాల్ని, అందాల్ని, ఆనందాల్ని అందిస్తుంది. తన రాకతో స్తబ్దుగా ఉండే మనం భావోద్వేగాల ప్రతీకలమైపోతాం.

సంతోషానికి కడలి అలలా ఎగసిపడతాం. చిన్న బాధకే కన్నీరై కరిగిపోతాం. ప్రతి ఆనందాన్నీ చిరునవ్వుతో పట్టుకుంటాం. తను స్ఫురిస్తే చాలు పులకించిపోతాం. ఇవన్నీ ప్రేమానుభూతులని అర్థమైన కొద్దీ ఇంకా తన ప్రేమలో మునిగిపోతాం.

అప్పుడు మనకెవరూ చెప్పలేదుగా ప్రేమించడాన్ని. మనకెలా తెలిసింది..?

నేస్తం..! ప్రేమించడం ఒకరు నేర్పిస్తే రాదు. అది ఒకరి దగ్గర నేర్చుకునేది కాదు.

మొక్కకి తెలీకుండానే దానికో అందమైన పూవు పూసినట్టు, కోకిలకి తెలీకుండానే దాని స్వరం మధురమైనట్టు, మనకు తెలీకుండానే మనలోకి వస్తుంది ప్రేమించడం.

41. ప్రేమ ఏం కోరుకుంటుంది..?

ప్రేమ- ప్రేమించిన వ్యక్తి నుంచి ఏమైనా కోరుకుంటుందా..? ఆశిస్తుందా..?

మన కళ్ళముందు ఎన్నో ప్రేమల్ని చూస్తాం. కొన్ని ప్రేమలు పెళ్ళి బంధంతో ఏకమవుతాయి. అంటే ప్రేమ పెళ్ళిని కోరుకుంటుందా..?

మరికొన్ని ప్రేమలు ఫలించని పరిస్థితుల వల్ల త్యాగంతో ముగుస్తాయి. అంటే అర్థం ప్రేమ త్యాగాన్ని కోరుకుంటుందనా..?

చాలామంది- ప్రేమ త్యాగాన్ని కోరుకుంటుంది అంటారు. అంటే త్యాగాన్ని కోరుకోని ప్రేమలు నిజమైన ప్రేమలు కావనా..?

పెళ్ళితో ఒకటైన ప్రేమలో- పెళ్ళి తరువాత కూడా ప్రేమ ఉంటుందా..? ఉండి తీరాలి కదా..! అందరిలో అలా ఇంకా ఉంటూనే ఉందా...?

త్యాగంతో వేరైపోయిన ప్రేమల్లో.. విడిపోయాక తనమీద ప్రేమ ఉండదా..? ప్రేమ కోరుకునేది త్యాగమే అయినప్పుడు తను విడిపోయాక తనమీద ప్రేమ భావం ఉండకూడదు కదా. కానీ విడిపోయినా ఇంకా 'తన' ప్రేమ భావాల్లో మునిగిన వారున్నారు.

మరి ప్రేమ నిజంగా ఏం కోరుకుంటుంది..?

దేన్నైనా కోరుకుంటుందా...?

నేస్తం...! ప్రేమ- పెళ్ళినో, త్యాగాన్నో కోరుకోదు. ప్రేమ ప్రేమనే కోరుకుంటుంది.

42. ప్రేమించడం కష్టమా...?

ఒకర్ని ప్రేమించడంలో ఉన్నంతగా మన ప్రమేయం ఒకరి ప్రేమని పొందడంలో ఉండదేమో..!

ఒకరిని ప్రేమించడం మొదలుపెట్టాక అది ఎప్పటివరకు..? ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉండాలా...? అలా ప్రేమించడం కష్టమా..?

మనసుకి నచ్చినంత మాత్రాన.. మనకు తెలియని వ్యక్తి- మన మనసుని మురిపించినా, మనసు బాధపడే పనిచేసినా ఒకేలా ప్రేమించగలగడం ఎవరికి సాధ్యం..?

తెలిసో తెలియకో ఏవో తప్పులు చేస్తూనే ఉంటాం మనం. పొరపాటు 'తను' చేసినా, మనం చేసినా దాన్ని తెలుసుకుని దిద్దుకునేవారు, 'తను' గ్రహించగలిగేలా వివరించేవారు ఎంతమంది...?

నేస్తం...! ప్రేమించడం చాలా కష్టమే. ఎందుకంటే అందులో ప్రేమించడం ఒక్కటే కాదు... ఆ ప్రేమని జీవితాంతం వరకు నిలుపుకోవడం, తనూ మనల్ని ప్రేమించగలిగేలా చూసుకోవడం ఈ రెండూ ఇమిడి ఉంటాయి.

ప్రేమించడం తేలికే. కానీ ఆ ప్రేమని నిలబెట్టుకోవడమే కష్టం. అందుకే నిజమైన ప్రేమెప్పుడూ నిత్య సత్యమే.

మనం ప్రేమిస్తాం. కానీ మన ప్రేమని జీవితాంతం నిలబెట్టుకునే ప్రయత్నం చెయ్యం. అందుకే అపార్థాలూ, అనుమానాలూ, విడిపోవడాలూ..!

మనకి ప్రేమించడం కష్టం. కానీ ప్రేమ గురించి తెలిసిన వాళ్ళకి, స్వచ్ఛంగా ప్రేమించగలిగేవాళ్ళకి ప్రేమించడం కష్టం కాదు.. ఇష్టం..!

43. ప్రేమకి అటు ఇటు

'నేను తనని ప్రేమిస్తున్నాను. తనంటే నాకు చాలా చాలా ఇష్టం. తనకోసం ఏం చెయ్యమన్నా చేస్తాను. కానీ తను నా మనసునర్థం చేసుకోకుండా వద్దన్న పనినే చేస్తూ నన్ను బాధపెడుతుంటే ఎలా భరించను..?' – ఇది అటువైపు వాదన.

'నేనంటే ప్రాణం. మరి నావైపు నుండీ ఆలోచించాలిగా. ఎందుకు చెప్తున్నానో అర్థం చేసుకోకుండా, ఎందుకలా చేశానో ఆలోచించకుండా పరుషంగా మాట్లాడితే ఎలా...?'– ఇది ఇటువైపు వాదన.

'నువ్వూ, నేను' కాదు, ప్రేమంటే 'మనం'.. అనుకున్న మనం ఏ చిన్న పొరపాటువల్లో 'నువ్వా.. నేనా..' అనుకునేంతగా పంతం పట్టేస్తాం ఒక్కోసారి.

సమస్యని ఆసాంతం వినకుండా, అన్నివైపుల నుంచీ చూడకుండా ఏదో ఓ కోణం నుంచే చూసి ప్రేమకు అటు తను, ఇటు నేనుగా విడిపోతాం. తప్పు మొత్తాన్నీ అటో ఇటో పడేస్తాం. కానీ తెలీక చేసిన తప్పుని గ్రహించి కూడా మరలా చెయ్యడం నిజంగా తప్పే.

రూపంలోనో, గుణంలోనో లోపాలుండడం సహజం. అలాగే ప్రేమలో కూడా అపార్థాలు సహజం. ఆ అపార్థాలు తొలగించుకోవడం ముమ్మాటికీ మన వంతే.

తనలోని నవ్వుని, అందాన్ని, ప్రేమని స్వీకరించినట్లే లోపాల్నీ స్వీకరించలేమా..? తెలీక చేసిన చిన్న తప్పుకి తననీ, తన ప్రేమనీ దూరం చేసుకుంటామా..?

నేస్తం..! చంద్రుడిలో 'మచ్చ' ఉందని వెన్నెల్లో తడవడం మానేస్తామా..?

44. ప్రేమకు స్వేచ్ఛ

స్వేచ్ఛకు ప్రతీక తూనీగ. ఎంత స్వేచ్ఛ దానికి..! దానికే కాదు... ప్రకృతి మొత్తానికీ.

ప్రకృతింత అందంగా కనిపిస్తుందంటే దానికి ముఖ్య కారణం స్వేచ్ఛే.

ఆ నీలిమేఘం కరి రంగుదాల్చి చేసే పయనంలో ఆసాంతమూ ఎటు వెళ్ళాలనే నిర్దేశనమూ నిర్ణయమూ లేవు. ఎటో సాగే పయనంలో ఎక్కడో పరిచయమయ్యే చల్లగాలి 'కలయిక'కి తృప్తై కరిగి పన్నీరుని చిలకరించడంలోనూ దానికి స్వేచ్ఛ ఉంది.

పాడే కోయిలలో, పూసే ప్రతి పూవులో, ఎగిరే పిట్టలో ఎటు చూసినా స్వేచ్ఛే.

ఇంతవరకూ నేనాలోచించలేదు స్వేచ్ఛ గురించి. నువ్వు చెప్పాక ప్రపంచం మొత్తంలో స్వేచ్ఛే కనిపిస్తుందేమిటో.. ఒక్క మనుషుల్లో తప్ప..!

ఇది చెయ్యాలి.. అది చెయ్యకూడదు.. ఇలానే చేయాలి.. అలా చెయ్యకూడదు.. ఏంటింత నిర్దిష్టత..?

గడిచిన కాలం గీసిన గీతమీద కళ్ళగంతలు కట్టుకుని చేసే ప్రయాణం ఎన్నాళ్ళు..?

"స్వేచ్ఛ, నమ్మకం ఉన్నచోట ప్రేమ ఉంటుంది. ఉండి తీరుతుంది.." అని నువ్వన్నప్పుడు అంత పెద్ద ప్రేమకి మూలం ఆఫ్ట్రాల్ ఈ రెండేనా అనుకున్నాను. కానీ ఈ జీవిత పయనంలో నేను చేసే ప్రతి పనిలోనూ ఆ రెండింటినీ వెతుక్కోవడం మొదలుపెట్టానా.. నా అంతర్గత స్వభావం కనిపించి నేను ప్రేమ ముందు ఎంత స్వల్పమో తెలియసాగింది.

'ఇది ప్రేమేనా..?' అనిపిస్తోంది నాకు..! సంకుచిత తత్వంతో విశాలత్వాన్ని కోల్పోయిన ఇరుకు మనసు తీరులా ఉంది.


స్వేచ్ఛ ఉన్నచోట నమ్మకముంటుంది. మనకు స్వేచ్ఛనివ్వని వ్యక్తిమీద నమ్మకం కలగడం అసాధ్యం కాబట్టి..!

నమ్మకం లేనిచోట స్వేచ్ఛా ఉండదు. ఎందుకంటే ఎవ్వరైనా మనమీద నమ్మకం లేనిదే స్వేచ్ఛనివ్వరు కాబట్టి..!

స్వేచ్ఛ, నమ్మకం లేనిచోట ప్రేమా ఉండదు. ఎందుకంటే ప్రేమంటే నమ్మకం, స్వేచ్ఛే కాబట్టి.

నేను ఏ భావోద్వేగాలు, అసూయాద్వేషాలతో కల్తీకాని ప్రేమని నీమీద చూపించగలిగితే.. ఆ స్వచ్ఛమైన ప్రేమ నీ హృదయాన్ని తాకితే... నీ మనసు నన్నొదిలి ఇంకెటు వెళ్తుంది..?

నేస్తం..! ప్రేమంటే.. నీ తోడులోనే దిగంతాల అంచుల వరకూ వెళ్ళి రాగలిగేంత స్వేచ్ఛ కదూ..!



45. ప్రేమ స్పర్థ

ఒకప్పుడు తననెంతగానో ఇష్టపడిన మనం ఇప్పుడు తనకి దూరమవ్వాలని ప్రయత్నిస్తాం. తనతో మాట్లాడడానికి సుముఖంగా ఉండం. తను గుర్తొస్తే బాధగా, బరువుగా అనిపిస్తుంది.

కానీ ఒకప్పుడు.. తనతో మాట్లాడాలని రాలే చినుకులో ఉన్నంత ఆత్రం..! తనను తలుచుకుంటూనే క్షణం క్షణం..!

మరి ఇప్పుడు మనమెందుకింతలా మారిపోయాం...? మన ప్రేమా మారిపోయిందేం..?

సన్నజాజిలా సున్నితంగా ఉండే తను ఏ చిన్న సంఘటనలోనో కఠినంగా ప్రవర్తించడం మనల్ని బాధపెడుతుంది.

తనతో మన భావాల్ని పంచుకుందామనుకున్నప్పుడు ఆ కఠినత్వమే పొరగా అడ్డం పడుతుంది.

తన మీద ఇదివరకంత ఇష్టాన్ని చూపించలేం. చూపించబోయేంతలో ఆ చిన్న స్పర్థే మదిలో మెదులుతుంది. ఎగిసిన ప్రేమ కరిగిపోతుంది.

మరి దానికి పరిష్కారం...?

నేస్తం..! మనం తనతో మాట్లాడడానికి ప్రయత్నించబోయేంతలో మన మాటలకి, మనసుకి అడ్డుపడేది ఆ స్పర్థే కాదు.. 'తనతో నేను మాట్లాడటమా..' అన్న అహం కూడా.

ఆ క్షణం.. మనలో తొంగిచూసే అహాన్నీ, దానితోపాటూ 'తను' మనకు పంచిన మధురానుభూతుల తలపుల్నీ మనం మనస్సాక్షితో చూడగలిగితే అప్పుడు ఇక స్పర్థ అనేది ఉండదు. ఉండేది ప్రేమ ఒక్కటే..!

ఆ ప్రేమలో బాధ, బరువు, అహం, అన్నీ మాసిపోతాయి.

తేలికైన మనసు మళ్ళీ మళ్ళీ తనని తలుచుకుంటూనే ఉంటుంది క్షణక్షణం...!

46. లోతైన ప్రేమ

ప్రేమలో పైపైనే ఉండడం, లోతుగా ఉండడం ఉంటాయా..?

ప్రేమించడంలో పైపైన, లోతు అంటూ స్థాయిలుంటాయా...?

తనతో మన మాటలూ, మనసూ దగ్గరయ్యాక ఆ హాయి ఎప్పటికీ కావాలనిపిస్తుంది మనకి. జీవితాంతం తన తోడు, తన ప్రేమ మనదే అయితే చాలు... ఇంకేమీ అక్కరలేదనిపిస్తుంది.

ఆ ప్రేమని మనసుతో రుచి చూసినప్పుడు తను లేనిదే మనమూ లేమనుకుంటాం.

తనతో కలిసి బతకడమూ, తనతో కలిసి చనిపోవడమూ రెండూ ఒక్కలాగే అనిపిస్తాయి మనకి... ఆ గాఢమైన ప్రేమలో.

'అంత గాఢమైన ప్రేమ ఎప్పటికీ మనదే అవుతుందా...' అని మనసులో ఏ మూలో చిన్న సందేహం.

ఆ సందేహం 'తను నాకే చెందాలి' అనేంత స్వార్థంగా మారిపోతుంది. అందుకే 'నాకోసం ప్రాణాలైనా ఇస్తావా..?' అనడుగుతాం.

కానీ నేస్తం...! మనం తనని 'నాకోసం ప్రాణాలివ్వగలవా...' అని అడుగుతున్న ఆ క్షణంలోనే... తన ప్రాణం పోతుందన్న ఊహనే తట్టుకోలేకపోవడమే నిజమైన ప్రేమ.

ప్రేమ – మనం లేకపోయినా తను బాగుండాలని కోరుకుంటుంది గానీ మన కళ్ళముందు తను ప్రాణాలు కోల్పోవాలని కోరుకోదు. ప్రాణాలు ఇవ్వడమో, తీసుకోవడమో ప్రేమకు కొలబద్ద కాదు.

గాఢమైన ప్రేమ ప్రాణాలు ఇవ్వడానికీ సిద్ధంగా ఉంటుంది. కానీ ప్రాణాలివ్వగల్గడమే గాఢమైన ప్రేమ కాదు.

మనం ఆనందంగా బతుకుతూ, తనూ ఆనందంగా బతికేలా చేయడమే నిజమైన లోతైన ప్రేమ.

47. ఒక ప్రేమ పుట్టినరోజు

ప్రేమ..!

ప్రేమ గురించి ఎంతో చెప్పాలనుకున్నాను. కానీ ఎంత రాసినా ఇంకా ఏదో మిగిలిపోయినట్లుగా ఉంది. బహుశా ఇదే ప్రేమ అని నిర్వచించడం ఎవరి తరమూ కాదేమో.

రుచి చూసిన కొద్దీ ఇంకా ఇంకా కావాలని, అనంతమైన ఆ ప్రేమని ఆసాంతమూ అంది పుచ్చుకోవాలని ఉంటుంది.

అలాంటి ప్రేమ కోసం, మనల్ని ప్రేమించే వారికోసం అందర్లోనూ వెతుకుతూ ఉంటాం. మనల్ని ప్రేమించేవారు ఎక్కడ్నుంచో వస్తారని, ఎవరో వచ్చి మనకి ప్రేమను పంచుతారని, ఎదురుచూస్తాం మనం. అందరూ ప్రేమని ఆశించేవారే. మరి ప్రేమించేవారెవరు..?

నేస్తం..! ప్రేమ కావాలంటే ప్రేమించాలి. ప్రేమనీ, ప్రేమించడాన్నీ ప్రేమించాలి.

కొందరు అంటుంటారు.. 'నేను చాలా సిన్సియర్‌గా ప్రేమించాను, అయినా తను నా ప్రేమను అర్థం చేసుకోలేదు' అనీ, 'నిజంగా ప్రేమిస్తే వీళ్ళు అర్థం చేసుకోరు' అనీ వాళ్ళ మీద ద్వేషం పెంచుకుంటారు.

కానీ నేస్తం..! ప్రేమంటే ఒప్పుకోవడమూ, ఒప్పుకోకపోవడమూ కాదు. మనం ప్రేమిస్తే వాళ్ళు ప్రేమించాలి అనుకోవడం కాదు. ప్రేమంటే సొంతం చేసుకోవడం కాదు.

ఎవరి పరిస్థితులు వాళ్ళవి. ఎవరి మనస్తత్వం వాళ్ళది. అంత మాత్రాన ప్రేమని నిందించడం తగదు. మనం– మన సుఖం కోసం, మన ఆనందం కోసం, మన మనఃతృప్తి కోసం ప్రేమ అనే పదాన్ని వాడుకున్నట్లయితే అది నిజమైన ప్రేమ అవదు.

ప్రేమ ఎప్పుడూ ఒక్కటే కోరుకుంటుంది. అది– మనం ప్రేమించిన వ్యక్తి బాగుండాలని, ఆనందంగా ఉండాలని.

ఈ జీవితంలో మనం ప్రేమించిన వ్యక్తి దక్కవచ్చు, దక్కకపోవచ్చు. కానీ జీవితం చాలా పెద్దది. మనకి వచ్చిన భాగస్వామి వల్ల అమితమైన ప్రేమ దక్కవచ్చు.

ఎవర్నో ప్రేమించి మోసపోయి, ప్రేమని నిందించిన మనమే అప్పుడు.. ప్రేమ చాలా అద్భుతమైనది అంటాం. అందుకే నేస్తం..! మళ్ళీ మళ్ళీ చెబుతున్నా.. నిజమైన ప్రేమని నిందించకండి. ప్రేమని ప్రేమించండి.



48. మళ్ళీ చివురించాలని...

భావాలు అల్లరిగా

అలజడిగా కదులుతున్నాయ్.

నా చర్యల్ని చూసి

వెక్కిరిస్తున్నాయ్.

నా నియంత్రణని చూసి

భయపడుతున్నాయ్.

నా ఆలోచనల మాటున

గుసగుసలాడుకుంటున్నాయ్.

నాకేదో

నామోషీగా ఉంది

భావాలు, ఆలోచనల

అనవసర బరువుల్తో

మనసు మొద్దుబారుతోంది.

ఎందుకో... మరి

మనసు మార్పు కావాలంటోంది.

శిశిరం రాగానే

గతం మిగిల్చిన

స్మృతుల ఆకుల్ని కాల్చేసి,

ఆ క్షణం

మోడువారి చింతించినా..

మళ్ళీ లేలేతగా

చిగురించే చెట్టులా

నా మనసులోని

ఆకుల్లాంటి ఆలోచనల్ని

సంపూర్తిగా విదిల్చేసి


మళ్ళీ చిగురించాలని ఉంది..

సున్నితంగా లేతగా.

నా మనసుకీ అన్పిస్తోంది

గ్రీష్మం అంటని వసంతంలా

మళ్ళీ మళ్ళీ చివురించాలని..!!



49. శుష్క నవ్వులు

నిన్నో మొన్నో
నా మదిలో గుచ్చుకున్న
ఆ నవ్వుకోసం
వెదకి వెదకి
ఏం మిగల్లేదు
అన్వేషణ తప్ప..!
నిదురలోనూ.. లేచాకా..
కళ్ళు ఆత్రంగా
అటో ఇటో ఎటో చూస్తాయి.
అందర్నీ
గుచ్చి గుచ్చి వెంటాడతాయ్.
ఆ రోజున..
ఏ మేఘమాలికో
స్వచ్ఛంగా రాల్చిన
ముత్యపు చినుకంటి
చిరునవ్వుని
ఈ రోజుకూ వెతుక్కుంటూ
ఆ వీధో, ఈ వీధో
ఆ పై రాదారో సాగిపోతాను.
అందరి ముఖాల్లోకి
అలా అలా చూస్తాను.
ఎన్నో నవ్వులు..!
'ఏడిశాడు వెధవ' అన్నట్టో
'పెద్ద గొప్పేలే' అనో
'తిక్క కుదిరింది మా బాగా'

అనుకునే
సంకేతాల్నిచ్చే నవ్వులే..!
వ్యంగ్యంగానూ,
వంకరగానూ,
ఉదాసీనంగానూ,
ఎన్ని వెర్రి నవ్వులో..!
అర్థంపర్థం లేకుండానూ,
అసూయతోనూ,
అధికారం కోసమూ,
ఎన్నెన్ని నవ్వులో..!
కానీ.. ఆ నవ్వేదీ..?
నిన్న చూశానో
మొన్న చూశానో
అటు మొన్న చూశానో
ఏమైపోయిందీ..?
ఆ రోజు
పచ్చగా, బొద్దుగా,
కళకళలాడుతూ
సజీవంగా ఉందిగా..!
ఇప్పుడేంటి..
ఎటు చూసినా ఎవర్లోనైనా
అవే నవ్వులు.. కానీ..
బక్క చిక్కి
ఎండిపోయిన
శుష్క నవ్వులే..!

50. ఓ రహస్యం చెప్పాలని..

నేనో రహస్యం చెప్పాలి.
లేత మొగ్గైన నా మనసు
అపురూపమైన ప్రేమ స్పర్శతో
రేకులు విచ్చుకుందని
ఎవరికి చెప్పాలి..?
పట్టలేని ఆనందంతో
ఆరుబయటకు వచ్చాను.
'నాతో చెప్పు' అన్నట్టు
ప్రకృతి తనలోకి
ఆహ్వానించింది.
ఇంటి ఎదురుగా ఉన్న మల్లెపందిరి
ఆ పక్కనే ఉన్న సంపంగి, సౌగంధికలు
నన్ను రారమ్మని పిలిచాయి.
వెళ్ళి వాటి మధ్యన కూర్చున్నాను.
రంగురంగుల పూల దుప్పటిని
పరుచుకున్న నాచు మొక్కలు
నన్ను చూసి
పలకరింపుగా నవ్వాయి.
సంపంగి మ్రాను సువాసనలీనుతూ,
తలలో తురుముకోమని
ఓ మొగ్గని – నా ఒడిలోకి
మెల్లగా విసిరింది.
నా భావాన్ని గమనించి

నర్మగర్భంగా నవ్వింది మల్లెపందిరి.
'అది అంతేలే.. పట్టించుకోకు' అన్నట్టు
చిన్నగా ఊగింది సౌగంధిక.
తల పైకెత్తి
దాని ముఖంలోకి చూశాను.
తల వాల్చి నవ్విందది.
ఇష్టంగా వాటేసుకున్నాను దాన్ని.
వింతగా– మెత్తగా తోచిందది.
నా కాలి కింద పడి, నలిగిపోతూ
నోరు విప్పని నీలి నాచుపూవుని చూసి
గభాలున ప్రక్కకు గెంతాను.
"పీక నొక్కుతున్నా కిక్కురుమనదేం..?"
నా ప్రశ్నని చదివేసినట్టు
జవాబిచ్చింది మల్లెపందిరి.
'మాకు ప్రేమించడం ఒక్కటే తెలుసు.
మమ్మల్ని పెంచినవారినీ,
తుంచినవారినీ ఒకేలా చూస్తాం.
మీకు సేవ చేయడం,
మీ ఆనందం కోసం మేం అంతమొందడం
మా ధన్యతగా భావిస్తాం..'
అంటూ మల్లెపూల పళ్ళు తళుక్కుమనేలా
చిరునవ్వు నవ్వింది.
ప్రకృతిలో ఎన్ని నిగూఢ రహస్యాలు..?
నా కళ్ళు చెమర్చాయి.

మన మానవుల్లా అవన్నీ
మంచివారు, చెడ్డవారని ఎంచవు.
వాటికి ప్రేమ పంచడం మాత్రమే తెలుసు.
లేకపోతే..
ఈ సుమబాలలన్నీ
తమనలంకరించుకున్న
అధర్మ ఆయుఃవుల్ని
కాలనాగులై కాటేయవూ..!
ఈ కొన్ని క్షణాలలోనే
ప్రకృతి ఎంత పెద్ద జీవితసత్యం తెలిపింది..!
ఒక రహస్యం చెప్పాలని..
నే వెళితే
ఎన్ని రహస్యాలు చెప్పిందీ ప్రకృతి..!!



51. అనాధ

నేనో అనాధని..!

మంచితనం నా తండ్రి,

మానవత్వం నా తల్లి.

వారి నుంచి

దారి తప్పిపోయిన

అమాయక బిడ్డను నేను.

ఈ కలికాల కీకారణ్యంలో

ఎటు పయనించను..?

అనురాగం నాకు అన్న,

ఆప్యాయత నాకు అక్క.

వారిని వీడిపోయిన

పసికందును నేను.

ఈ కుతంత్రాల కారడవిలో

ఏ వైపు సాగిపోను..?

నా వాళ్ళయిన మంచితనం.. మానవత్వం

అనురాగం.. ఆప్యాయతలు

మీకెక్కడైనా ఎదురుపడితే

నాకు చెప్పరా..!

ఎందుకంటే

అయినవాళ్ళందరూ

దూరమైన అనాధని నేను..!

నాపేరు 'న్యాయం'..


నాది కాని

ఈ ప్రపంచంలో

మనుగడే అనుమానమై

బిక్కుబిక్కుమంటూ

బతుకుతున్న అనాధని నేను..!!




52. జీవిత సత్యం

అందానికి తలొగ్గితే–
అది అశాశ్వతమై
అనాకారితనం మిగులుతుంది.
మనసుకి తలొంచితే–
అందులోని మర్మం బయల్పడి
ఆవేదన మిగులుతుంది.
వ్యక్తిత్వానికి జోహారంటే–
అది అమ్ముడైందని తెలిశాక
ఆవేశం మిగులుతుంది.
ఐశ్వర్యానికి వెన్నుజేర్చితే–
అది నిలకడలేనిదని అనుభవమై
దుఃఖం మిగులుతుంది.
ఆదర్శాల్ని చేపడితే–
ఏది సత్యమో తేల్చుకోలేక
మనస్సంఘర్షణే మిగులుతుంది.
అన్నింటి కంటే
మేలైనది, స్వచ్ఛమైనది
నిత్యసత్యమైన ప్రేమే.
అందులో–
మన ప్రేమే మనకి
శాశ్వతంగా తోడవుతుంది.
అప్పుడు–
ఏ బాధలూ ఉండవు..
గెలుపోటములుండవు..
ఉండేదంతా ప్రేమే..!

53. రాలు పూలు

భూమి మీద
అడుగు పెట్టినప్పుడు
ప్రతి ఒక్కటీ
సున్నితంగానే ఉంటుంది.
ఒక విత్తు నుంచి పుట్టే-
పసరు మొలక..,
ఒక తల్లినుంచి విడే-
పసి బిడ్డ..,
ఒక చెట్టుకు వేసే-
చిగురు..,
ఒక మొక్కకు పూసే-
పూవు..,
ఇంకా- అది ఏదైనా కానీ
మన ప్రపంచంలోకి
తొలిచూపు
సారించినప్పుడు,
అది కపటం ఎరుగక
అమాయకంగానే ఉంటుంది.
లోకం చూపులు
దాన్ని తాకీ తాకగానే
క్రమక్రమంగా
వాటిల్లోనూ రాటుదనం..!
మొలక మొద్దుబారి

కాండమవుతుంది.
బిడ్డ గడ్డాలొచ్చి
కన్నవారికి అందనివ్వడు.
చివురు ముదిరి
ఆకు పెళుసవుతుంది.
వికసించిన పూవు మాత్రం
లోకాన్ని చూసి జాలిపడుతూ,
ఈ ప్రపంచాన్ని మార్చలేని
తన నిస్సహాయతకి
కుమిలిపోతూ,
ఓడి వాడి రాలి పోతుంది.



54. ఓ కంటి చినుకు..

అడుగడుగు లోతుల్లో ప్రజ్వలిస్తూ
ఆవేశంగా పొంగుకొచ్చే లావాలా
భగభగమంటుందా చినుకు..!
నిల్వ చేసుకున్న భారాన్ని
దూరాలకు మోయలేక
ఒక్కపాటుగ భళ్ళున
ఒలికించేసే మేఘంలా
కనిపిస్తుందా చినుకు..!
కఠోర శబ్ధాల్ని
ఉప్పెన బీభత్సాన్ని
విజయవంతంగా భరించాక,
ఆనందోత్సాహాలతో
ఆకాశం మోముపై విరిసే
చిరు దరహాసపు హరివిల్లులా
ఉంటుందా చినుకు..!
బాధలు, వ్యధల్లో
కనుకొలకులొలికి జారినా..
చేదు అనుభవాలు
జ్ఞాపకాలై ఉబికించినా..
ఫలించిన ఆశలు
ఆనందబాష్పమై చిందినా..
అదంతా ఓ కంటి చినుకే..!
భావోద్వేగాల మొలకే..!!

55. ప్రత్యర్థి

నాకు నువ్వంటే భయం,
నీ మాటలంటే భీతి.
ఎందుకంటే–
నువ్వు
మనసు లోపల్లోకి
తొంగి చూస్తావ్.
నిజాల్నే మాట్లాడతావ్.
నచ్చని వాటినీ
తప్పుదంటావ్,
తప్పుని వాటిని
ఆస్వాదించాలంటావ్.
నలుగుర్లో తిరుగుతుంటే
నాతోనే ఉంటావ్,
నన్నే విమర్శిస్తావ్.
వేలెత్తి చూపిస్తూ,
శత్రువులా
వెంటబడతావ్.
అందుకే–
నాకు నువ్వంటే భయం,
నీ మాటలంటే భీతి.
ఓ మనస్సాక్షీ..!
నాతోనే ఉన్నా,
నాలోనే ఉన్నా,
నువ్వే నా ప్రత్యర్థి..!

56. జీవ గమనం

నేను పుట్టినక్షణం ఏదో తెలుసు.

కానీ.. అప్పుడు నేనేంటో

నాకు తెలీదు.

నాకు నేనెప్పుడు తెలిశానో

అదీ తెలీదు.

నువ్వు ఇదన్నారు,

నువ్వే అది అన్నారు.

'నేనే కాబోలు ఇదంతా..'

అని అనుకున్నానప్పుడు.

కానీ– ఇప్పుడు

నాలోకి నేను

తొంగి చూసుకుంటుంటే,

'ఇది నేను కాదు..'

అనిపిస్తోంది.

చూపులు కదిలిపోతున్నాయ్..

చిత్రాలు మారిపోతున్నాయ్..

నిమిషాలు దొర్లిపోతున్నాయ్..

అనుభవాలు

నువ్వు- నువ్వు కాదు పొమ్మన్నాయ్.

మరి నేనెక్కడ..?

గడిచిన పాతికేళ్ళలో

నన్ను నేను

ఎక్కడ వెతుక్కోవాలి..?

నేనెవర్నో

ఎవరిని అడగాలి..?

నా పయనమెటో

ఎలా తెలుసుకోవాలి..?

ఇంకో పాతికేళ్ళు

ఇలా గడిచిపోయినా

నాకు నేను చిక్కుతానా..?

ఊపిరి ఆగిపోబోయే

ఆఖరిశ్వాసలో అయినా

నేనెవర్నో నాకు తెలుస్తానా..??

57. ప్రాను మనోగతం

నేను చెట్టుని..

ఓ పచ్చని జీవ జాతిని.

మేం శక్తినంతా కూర్చి

పుష్పం, ఫలం, సువాసనలుగా

కూడబెడతాం.

దారి కాచి దోచే దొంగల్లా

మా ఆస్తి కోసం

ఎదురు చూసి మరీ

దొంగిలించి, మీరు

సంబరం చేసుకుంటారు.

అంతటిలో ఆగక

మమ్మల్ని హింసపెట్టి

మా ప్రాణాలతో ఆడుకుంటారు.

మొన్నటికి మొన్న

నా స్నేహితురాలైన

తాటి చెట్టుని

కల్లు అనీ, ముంజెలనీ

నిలువునా దోపిడీ చేసి

అంతటితో వదలక

చేతుల ఆకుల్ని నరికి

మొండిదాన్ని చేశారు.

నా కళ్ళ ముందరే

కుడి భుజాలైన కొమ్మల్ని

కోల్పోయిన ఎందరో మిత్రులు,

విలవిలలాడుతుంటే


చూస్తూ ఉండడం తప్ప

ఏమీ చెయ్యలేని నిస్సహాయత నాది.

లాభం పొందుతున్నా,

మానవులకి

మా మీదెందుకింత కక్ష..?



58. జీవన చక్రం


అమ్మ ఒడిలో–
లాలి వింటూ నిదురించిన బాల్యాన్నీ,
నాన్న చేతిపట్టుతో–
తోడు పంచిన స్థైర్యాన్నీ,
స్నేహితుల సావాసం–
నేర్పిన ఆకతాయితనాన్నీ,
అన్నిటినీ..
వాటన్నిటినీ
పోగొట్టుకున్నానని
ఇప్పుడే తెలిసింది..!
ప్రతేటా పరీక్షలు మిగిల్చిన
సర్టిఫికెట్ల కాగితాల్నీ,
సంపాదించిన
ఉద్యోగానుభవాల్నీ,
అసంకల్పిత ప్రతీకారచర్యల్లా
మెదడు గ్రహించిన విజ్ఞానాన్నీ,
వాటిలోని..
నిర్జీవాన్నీ మాత్రమే
నాలో నింపుకున్నాననీ
ఇప్పుడిప్పుడే తెలుస్తోంది..!!

జీవితపు తొలి అంకంలోని
జీవం నిండిన
ఆహ్లాదాన్ని మరిచిపోయి
జీవన చక్రంలా తిరుగుతూ,
జ్ఞానం నేర్చిన
ఓ యంత్రంలా మారిపోయి
రోజుల్ని ఈడుస్తున్నాననీ,
ఎందుకో..
ఇప్పుడిప్పుడే తెలుస్తోంది..!!!

చీరలూ, చెప్పులూ,
ఇస్త్రీ పెట్టెలూ, ఇంట్లో సామాన్లూ..
అన్నీ లైట్ వెయిట్
మనుషులే హెవీ వెయిట్

59. చెదిరిన స్వప్నం

ఎర్రబారిన కళ్ళు
నిన్ను గుర్తు చేసుకుంటూ
మగతగా మూసుకున్నాయి.
నీ దరహాస
చిలిపి స్మృతిలో
ముసిముసిగా నవ్వుకున్నాయి.
అలసిన స్వప్నం మాటున
పగిలిన ఊసుల క్షణాల్ని
ఏరుకుని,
మధురంగా కళ్ళు విప్పాను.
నాకు తెలీకుండానే
రెండు కన్నీటి బొట్లు
రాలి పడ్డాయి.
అవి...
గతం తాలూకు శేషాలా...?
లేక
స్వప్నం తాలూకు అవశేషాలా...?



౬౦. గురుతులు మిగిలిపోయాయి

వానొచ్చింది..
వసుధ మనసులో
నాటుకుని నిలిచిపోయిన
అడుగుల గుర్తుల్ని చెరిపిపోయింది.
ఇసుక తుఫానొచ్చి
ఎడారి గుండెలోని
గుట్టలుగా పేరుకున్న ఎత్తుపల్లాల
బాధాగాధలను
సమంచేసి పోయింది.
మరి..
మనుషుల హృదయాల్లో
పాతుకుపోయిన
మరువలేని అనుభవాల
చేదు జ్ఞాపకాల్ని
ఎవరు వచ్చి
రూపుమాపి పోతారు..?





ప్రేమంటే ఒక ఆర్ద్రత.. గుండెని సున్నితంగా తాకే భావావేశం...!

ప్రేమంటే స్వచ్ఛత.. కనుపాపల లోతుల్లోంచి హృదయాన్ని చూడగల స్పష్టత..!

ప్రేమంటే అవగాహన..

ప్రతిక్షణాన్నీ ఎదుటివైపు నుంచీ చూడగల విశ్వసనీయత..!

ప్రేమంటే స్వేచ్ఛ..

తనకి దగ్గరగా ఉంటూనే అంతులేని అంచుల్లోకి వెళ్ళిరాగలంత స్వాతంత్ర్యం..!

ప్రేమంటే.. ఉదయించే వెచ్చదనంలోని వెలుగే కాదు,

అస్తమించాక వచ్చే చల్లని చీకటి కూడా.

'జీవితం' అంటే ఏంటో మోడుబారి చిగురించిన ప్రతి చెట్టుకూ తెలుసు.

'జీవించడం' అంటే ఏంటో కొమ్మల్లోని ప్రతి చివురుకీ తెలుసు.

... బి. గీతిక



